అంచనాలతో కుస్తీ..!

- పోలైన ఓట్ల నివేదికలు పట్టుకుని లెక్కలు
- ఫలితాలపై అభ్యర్థుల తర్జనభర్జన
- ఏం జరుగుతుందోనని గుబులు
- జూన్ 4 వరకు టెన్షన్.. టెన్షన్
- మరోవైపు గెలుపుపై బెట్టింగ్ జోరు



పోలింగ్ ముగిసి వారం రోజులైంది. ఓటర్లు రోజు వారి పనుల్లో నిమగ్నమయ్యారు. పోలింగ్ విధుల్లో బిజీగా గడిపిన అధికారులు రోజువారి విధుల్లోకి వెళితే.. సెలవులు కావడంతో ఉపాధ్యాయులు కుటుంబాలతో కలిసి వేసవి వినోదం టూర్లకు ప్లాన్ చేసుకుంటున్నారు. అయితే.. సార్వత్రిక సమరంలో తలపడిన ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపు అంచనాలతో కుస్తీ పడుతున్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా పోలైన ఓట్ల నివేదికలు, వివరాలు టేబుల్‌పై పెట్టుకొని ఫలానా పోలింగ్ కేంద్రంలో మనకు మెజార్టీ వస్తుంది..? ఫలానా కేంద్రంతో ప్రత్యర్థికి స్వల్ప మెజార్టీ వస్తుంది..? మనం డబ్బులు ఇచ్చినా స్థానిక నాయకుడు పంపిణీ చేయకపోవడంతో అక్కడ మనకు ఓట్లు పడలేదు..? ఫలానా వార్డులో ఉద్యోగులు, యువకులు, వ్యాపారులు ఎక్కువగా ఉన్నారు.. అక్కడ మనకే మెజార్టీ వస్తుంది..! లెక్కల్లో అభ్యర్థులు బిజీబిజీ అయ్యారు. గ్రామ, వార్డు ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలతో ఏ గ్రామంలో లీడ్ వస్తుంది..? ఏ గ్రామం, వార్డులో చేజారిపోతుంది..? అనే అంశాలపై చర్చిస్తున్నారు. బూత్‌ల వారీగా ఇచ్చిన డబ్బులు.. ఆ డబ్బు ఓటర్లకు ఏ మేరకు చేరింది.. డబ్బులు తీసుకున్న ఓటర్లు మనకే ఓటు వేశారా..! అంటూ ద్వితీయ శ్రేణి నాయకులను ఆరా తీస్తున్నారు. అదే క్రమంలో అభ్యర్థి ఇచ్చిన డబ్బులు సక్రమంగా ఓటర్లకు చేర్చని ద్వితీయ శ్రేణి నాయకుల ఫోన్లు స్విచ్‌ఆఫ్ వస్తుడటం గమనార్హం.

కర్నూలు, మే 18 (ఆంధ్రజ్యోతి):

కర్నూలు లోక్‌సభ స్థానం పరిధిలో కర్నూలు, కోడుమూరు (ఎస్సీ), ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాలతో పాటు నంద్యాల లోక్‌సభ స్థానంలో పరిధిలోని పాణ్యం సెగ్మెంట్ కూడా జిల్లా పరిధిలో వస్తుంది. ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో 20,54,563 మంది ఓటర్లు ఉండగా.. 15,70,007 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లాలో సగటున 76.42 శాతం పోలింగ్ నమోదైంది. రాష్ట్ర విభజన తరువాత జరిగిన మూడు సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ శాతం పరిశీలిస్తే ఇప్పుడే పోలింగ్ పెరిగింది. గత ఎన్నికలతో పోలిస్తే 1,72,517 మంది ఓటర్లు అధికంగా ఓటు వేశారు. రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలకు ఈవీఎంలు చేర్చారు. అభ్యర్థుల భవిత ఈవీఎంలలో నిక్షిప్తమైంది. పోలింగ్ ముగిని మూడు గడిచిపోయినా అభ్యర్థుల్లో ఉత్కంఠ ఏ మాత్రం తగ్గలేదు. గ్రామాల వారిగా లెక్కలు వేస్తూ అంచనాలతో కుస్తీ పడుతున్నారు. తమకు గెలిచే అవకాశాలు అధికంగా ఉన్నాయని, ఫలానా సామాజికవర్గం ఓట్లు మాకే గంపగుత్తగా పడ్డాయని, ఆ ఓట్లతోనే విజయం సాధిస్తామంటూ టీడీపీ కూటమి, వైసీపీ అభ్యర్థులు ధీమా వ్యక్తం చేయడం కొసమెరుపు.





పట్టణాలతో పల్లెల్లో నాయకులు, కార్యకర్తలు చెబుతున్న ఓట్ల లెక్కలు మాటలతో అభ్యర్థులు కొంత ఊరట చెందుతున్నారు. అదే క్రమంలో ఫలానా చోట మనకు తక్కువ వస్తాయి కావచ్చు.. అనే అనుమానాలు కూడా వెంటాడుతుండడం అభ్యర్థుల్లో గుబులు రేకెత్తిస్తోంది. మంత్రాలయం నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే బాలనాగిరెడి, ఆయన సన్నిహితులు రెండు రోజులుగా గ్రామాల నాయకులు చెప్పే ఓట్ల లెక్కలతో 'మనమే గెలుస్తాం..' అంటూ ధీమా వ్యక్తం చేసినట్లు తెలిసింది. అయితే నియోజకవర్గంలో మెజార్టీ ఓటర్లు ఉన్న వాల్మీకులు పార్టీలకు అతీతంగా గంపగుత్తగా టీడీపీకి వేసి ఉంటారనే అనుమానం రావడంతో అధికార వైసీపీలో ఓ రకమైన భయం కలవరపెడుతోంది. ఆదోనిలో పోలింగ్ మరుసటి రోజు వైసీపీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. ఫలానా పోలింగ్ కేంద్రంలో సైక్లింగ్ చేసి వంద ఓట్లు వేశామని ఒకరు.. మా వార్డులో రెండొందలు వేయించామని మరొక నాయకుడు చెబితే.. మా ఊర్లో బీజేపీకి ఏజెంటే లేడంటూ ఓ గ్రామ నాయకుడు చెబుతూ వచ్చారు. ఆ మాటలు.. లెక్కలు విన్న వైసీపీ అభ్యర్థి సాయిప్రసాద్‌రెడ్డి '50 వేల ఓట్లతో గెలుస్తాం' అంటూ అతి నమ్మకంతో ఉన్నట్లు సమాచారం. ఈ రెండు రోజుల్లో లెక్కల్లో తేడాలు కనిపిస్తున్నాయని, బీజేపీ అభ్యర్థి డాక్టర్ పార్థసారథిరెడ్డి వాల్మీకి సామాజికవర్గం కావడం, ఆ వర్గం ఓట్లు గంపగుత్తగా ఆయనకే పడ్డాయనే ప్రచారం జోరుగా అందుకుంది. అదే క్రమంలో చేనేతలు మెజార్టీగా బీజేపీ కమలం వైపే మొగ్గు చూపారు.. ఉద్యోగులు ప్రభుత్వ వ్యతిరేకతతో ఆ పార్టీకే ఓట్లు వేశారని, పల్లెల్లో కూడా ఆశించిన స్థాయిలో మనకు ఓట్లు రాలేదని లెక్కలు చెబుతుండడంతో సాయి గుండెల్లో గుబులు మొదలైందని ఆ పార్టీ నాయకులే అంటున్నారు. మంత్రాలయం, ఆదోనిలో ఒక్కటే కాదు.. జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాల్లోని అభ్యర్థులకు గణాంకాల అంచనా నిద్రలేకుండా చేస్తోంది.

మూడు ఎన్నికల్లో పోలింగ్ శాతం ఇలా

నియోజకవర్గం	2014	2019	2024
కర్నూలు	58.27	59.53	63.75
పాణ్యం	71.74	74.41	74.44
పత్తికొండ	78.80	83.97	84.98
కోడుమూరు	74.57	78.77	79.14
ఎమ్మిగనూరు	74.47	79.15	81.97
మంత్రాలయం	78.02	84.98	84.31
ఆదోని	65.28	65.31	66.55
ఆలూరు	75.97	79.71	80.73
సగటు	72.24	75.87	76.42



బెట్టింగ్‌ల జోరు

ఓటర్లు ఇచ్చిన తీర్పు ఈవీఎంలో నిక్షిప్తమై ఉంది. జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉండబోతోంది. అంటే ఇంకా ఇంకా 16 రోజుల సమయం ఉంది. సోషల్ మీడియాలో పలు రకాలు సర్వేలు జబ్బుముబ్బడిగా వస్తున్నాయి. అదే క్రమంలో రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర మూడు విభాగాలు విభజించి ఏ ప్రాంతంలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి..? ఏ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది..? అంటూ బెట్టింగ్‌లు వేస్తున్నారు. అదే క్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏ పార్టీకి సీట్లు వస్తాయి..? ఏ నియోజకవర్గంలో ఏ అభ్యర్థి గెలుస్తారు..? అంటూ భారీగా పందెం కాస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో రూ.కోట్లలో బెట్టింగ్ జరుగుతోంది. అదే క్రమంలో 2014, 2019, 2014 ఈ మూడు ఎన్నికల్లో పోలింగ్ శాతం ఆధారంగా పెరిగిన పోలింగ్ శాతం ఏ పార్టీకి అనుకూలం, తొలిసారిగా ఓటు వేసిన యువ ఓటర్లు ఎటు వైపు మొగ్గు చూపారు..? లెక్కలతో కుస్తీ పడుతూ.. ఓ అంచనాకు వచ్చి బెట్టింగ్‌లు వేస్తున్నారు.



ఆలూరు విద్యుత్ శాఖ

డీఈఈపై వేటు

- అడ్డగోలుగా ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుపై ఫిర్యాదులు
- సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారుల నిర్ణయం


నాగేంద్ర ప్రసాద్, విద్యుత్ శాఖ డీఈఈ, ఆలూరు

ఆలూరు, మే 18: ఆలూరు సబ్ డివిజనల్ విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేంద్ర ప్రసాద్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు ఆయన్ను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఆలూరు నియోజకవర్గంలోని హొళగుంద మండలం హెబ్బటం గ్రామంలో ఓ రైతు పొలంలో అనుమతులు లేకుండానే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో 15 రోజుల క్రితం విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ ఉమాపతి నేరుగా గ్రామానికి వచ్చి విచారణ చేపట్టారు. అనుమతులు లేకుండా నాగభూషణం రెడ్డి పొలంలో వేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి వాటిని తీసుకెళ్లారు. ఈ విషయంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, డీఈఈ నాగేంద్ర ప్రసాద్‌ను సస్పెండ్ చేసినట్లు ఎస్ఈ ఉమాపతి వెల్లడించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ రోజు, హాలహర్వి మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినా కూడా డీఈఈ పట్టించుకోలేదు. సస్పెన్షన్ వ్యవహారంలో ఈ అంశాన్ని కూడా ఉన్నతాధికారులు పరిగణలోకి తీసుకున్నారు.

బయటపడ్డ అక్రమ విద్యుత్ కనెక్షన్లు

నిబంధనల మేరకు వ్యవసాయానికి ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకోవాలంటే విద్యుత్ శాఖకు డీడీ చెల్లించి, అనుమతులు వచ్చిన తర్వాతే ఏర్పాటు చేసుకోవాలి. అలా కాకుండా కొందరు కాంట్రాక్టర్ల ద్వారా అధికారులతో మాట్లాడుకుని కర్ణాటక నుంచి ట్రాన్స్‌ఫార్మర్లు తెచ్చుకొని కొందరు అక్రమంగా విద్యుత్‌ను వాడుకుంటున్నారు.. ఈ విషయంపై ఫిర్యాదులు రావడంతో ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఇదే క్రమంలో విద్యుత్ శాఖలో కొందరు కాంట్రాక్టర్లు చక్రం తిప్పుతున్నారు. అధికారులతో సన్నిహితంగా ఉంటూ, అక్రమంగా కనెక్షన్లు, విద్యుత్ స్తంభాలు ఇప్పిస్తూ నేరుగా రైతులు, అధికారులకు మధ్య వ్యవహారాలు నడిపిస్తున్నారు.

ఏఈ పాత్రపై కూడా విచారణ

హొళగుంద మండలం హెబ్బటం గ్రామంలో వెలుగుచూసిన అక్రమ ట్రాన్స్‌ఫార్మర్ల అనుమతుల భాగోతంపై ఉన్నతాధికారుల చర్యలతో ఆలూరు డీఈఈ నాగేంద్రప్రసాద్‌పై వేటుపడింది. అయితే అదే మండలంలో పని చేస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)పై కూడా అధికారులు విచారణ చేపడుతున్నారు. ఈ వ్యవహారంలో ఏఈ పాత్ర ఎంతవరకు ఉంది? ఆమెకు తెలిసే ఇదంతా జరిగిందా..? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు జిల్లా విద్యుత్‌శాఖ సూపరిండెంట్ ఇంజనీర్ ఉమాపతి తెలిపారు.

మూడు రోజులు వానలు

- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం
- అప్రమత్తంగా ఉండాలంటున్న వాతావరణ శాఖ



కర్నూలు(అగ్రికల్చర్), మే 18: బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో మరో మూడు రోజులు కోస్తాంధ్రతో పాటు రాయలసీమలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నివారణ సంస్థ అధికారులు ప్రకటించారు. ఇప్పటికే నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వాగులు, వంకలకు నీటి ప్రవాహం మొదలైంది. ఇప్పటికే మండుటెండలకు కర్నూలు జిల్లాలోని వాగులు, వంకలతో పాటు హంద్రీ, తుంగభద్ర నదుల్లో చుక్కనీరు లేని పరిస్థితి నెలకొంది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కర్నూలు నగరం మీదుగా ప్రవహిస్తున్న హంద్రీనదిలో నీటి ప్రవాహం మొదలైంది. తుంగభద్ర నదికి ఎగువ ప్రాంతాల్లో వరదనీటి ప్రవాహం మొదలైనట్లు నీటి పారుదల శాఖ అధికార వర్గాలు తెలిపాయి. ద్రోణి ప్రభావంతో జూన్ మొదటి వారంలో కేరళకు నైరుతి రుతుపవనాలు రానున్నాయనీ, దీని వల్ల ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వర్షాలు మొదలవుతాయనీ వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. శనివారం కర్నూలు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిశాయి. కల్లూరులో 52.4 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదు కాగా కర్నూలు అర్బన్‌లో 22.6, కర్నూలు రూరల్ 14, మద్దికెరలో 10.2, ఓర్వకల్లులో 4.6 మి.మీ., మేర వర్షం కురిసింది. మే నెలలో సగటున 40.1 మి.మీ., వర్షం కురవాల్సి ఉండగా.. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు 76.4 మి.మీ., వర్షం నమోదైంది. సాధారణం కంటే అదనంగా 36 మి.మీ., వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు.

జిల్లా జైలు తనిఖీ

కర్నూలు(లీగల్), మే 18: నగర శివారులోని పంచలింగాలలో ఉన్న జిల్లా జైలును కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్.శ్రీనివాసరావు శనివారం తనిఖీ చేశారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఆయన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రితో కలిసి ఆయన ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా ఆయన కారాగారానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి ఖైదీలకు అందిస్తున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఖైదీలతో మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయం అవసరమైన వారికి న్యాయ సహాయాన్ని ఉచితంగా అందజేస్తామన్నారు. అవసరమైన ఖైదీలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. ఖైదీలు సత్ప్రవర్తనను అలవర్చుకుని సమాజంలో మంచి పౌరులుగా మెలగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా జైలు సూపరింటెండెంట్ ఘనే నాయక్, చీఫ్ లీగల్ ఎయిర్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్, తదితరులు పాల్గొన్నారు. ఆ తర్వాత వారు నగరంలోని మహిళా జైలును తనిఖీ చేశారు. మహిళా జైలులో మహిళలకు కల్పించిన భద్రత, వసతుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.


ఖైదీలనుద్దేశించి మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్.శ్రీనివాసరావు

కృష్ణా తీరానికి అతిథులు

- సంగమేశ్వరంలో సందడి చేస్తున్న పక్షులు
- ఆహార సేకరణ, సంతానోత్పత్తికై వలస




సంగమేశ్వర క్షేత్రంలోని కృష్ణాతీరంలో సందడి చేస్తున్న వలస పక్షులు







ఆత్మకూరు, మే 18: పక్షులు లేని ప్రపంచాన్ని ఊహించుకోవడం చాలాకష్టం. సృష్టిలోనే అద్భుతమైన, స్వర్గంలోని రాయబారులుగా వీటిని అనువదిస్తారు. అయితే పక్షులు తమ జీవన విధానాల్లో భాగంగా వాతావరణ పరిస్థితులకు తగ్గట్లుగానే ఓ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలసలుగా వెళ్తుంటాయి. అక్కడే కొద్దిరోజుల పాటు ఆహారసేకరణ, సంతానోత్పత్తి చేపట్టి తిరిగి తమ ప్రదేశాలకు చేరుకుంటాయి. అయితే ఆయా ప్రదేశాలకు వలస వచ్చిన పక్షులుగా అతిధులు భావించి వాటిని ఆదరించడం పరిపాటిగా వస్తోంది. సప్తనదీ సంగమేశ్వర క్షేత్ర పరిధిలోని కృష్ణానదీ తీరంలో వలస పక్షులు సందడి చేస్తున్నాయి. వేల మైళ్ల నుంచి ప్రయాణం చేసి ఆత్మకూరు ప్రాంతంలోని కృష్ణాతీరానికి చేరుకుంటున్నాయి. కృష్ణానదీలో జలాలు బయటపడే చేపలను ఆహారం తీసుకుని ఇక్కడే జతకూడి, గుడ్లు పెట్టి తమ సంతతిని అభివృద్ధి చేసుకుంటాయి. పిల్లలకు రెక్కలొచ్చాక వాటిని వెంట పెట్టుకుని మళ్లీ ఎగిరిపోతున్నాయి. కాగా సంగమేశ్వరంలో కొంగ జాతికి చెందిన వివిధ పక్షులు రంగురంగులో ఆకట్టుకుంటున్నాయి. సప్తనదీ సంగమక్షేత్రంలో నదీజలాలు పుష్కలంగా ఉన్నప్పుడు పక్షులు తక్కువగా కనిపిస్తుంటాయి. అదే జలాలు అడుగంటిపోయే కొద్దీ వలస పక్షుల సందడి పెరుగుతోంది. కాగా వెలుగోడు జలాశయం పరిధిలో కూడా వలస పక్షులు సందడి చేస్తుంటాయి.

రాత్రికి రాత్రే ప్రయాణం : సహజంగా పక్షులు పగటిపూట ప్రయాణం చేస్తుంటాయి. అయితే వివిధ దేశాల నుంచి వచ్చే వలస పక్షులు మాత్రం రాత్రివేళల్లో గుంపులుగా ప్రయాణిస్తాయి. వీటి ప్రయాణం సూర్యస్తమయమైన గంట తర్వాత ప్రారంభమవుతోంది. అర్ధరాత్రి సమయంలో పూర్తిస్థాయిలో ప్రయాణం చేస్తాయి. పగలంతా ఆహార సేకరణ చేస్తూ విశ్రాంతి తీసుకుంటాయి. రాత్రివేళల్లో ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటం వల్ల పక్షి తనకు కావాల్సిన శరీర ఉష్ణోగ్రతను నియంత్రించుకుంటూ ఎంత దూరం ప్రయాణం చేయగలిగేదని అంచనా వేసుకుంటాయని పక్షుల నిపుణులు పేర్కొన్నారు.

పక్షుల వలసలకు కారణమిదే : జతకట్టి గుడ్లను పెట్టి పిల్లలను పెంచుకోవడానికి వసంత కాలం ఇక్కడ అనుకూలంగా వుంటుంది. ఆహారం సమృద్ధిగా లభిస్తుంది. దీంతో పాటు విదేశాల్లో శీతల తీవ్రత నుంచి బయటపడేందుకు వెచ్చని ప్రదేశాలకు పక్షులు వలసలుగా వస్తుంటాయి. వాతావరణంలో వచ్చే మార్పులు ప్రధానంగా పక్షుల వలసలకు దారితీస్తాయి. వీటి ప్రయాణానికి కావాల్సిన కొవ్వును వాటి శరీరంలో నిల్వ చేసుకుని భూమికి 3వేల అడుగుల ఎత్తులో ఆగకుండా 90గంటల పాటు ప్రయాణించే శక్తి ఉంటుందని అంచనా. సూర్యుడు, నక్షత్రాలను తమ మార్గదర్శకాలుగా చేసుకుని భూమి అయస్కాంత క్షేత్రంలో మార్పులు, నక్షత్రాలతో పాటు వాసన ఆధారంగా సుదూర ప్రాంతాలకు ప్రయాణిస్తాయని పర్యావరణ నిపుణులు పేర్కొంటున్నారు.

టీఎస్ ఈఏపీసెట్ ఫలితాల్లో కర్నూలు విద్యార్థుల హవా

● టాప్ టెన్‌లో మూడు స్థానాలు కైవసం ● కర్నూలు వాసులకు స్టేట్ 2,5వ ర్యాంకు ● ఆదోని విద్యార్థికి స్టేట్ 4వ ర్యాంక్

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 18: తెలంగాణ స్టేట్‌లోని ఇంజనీరింగ్, అగ్రికల్చర్, బీ-ఫార్మసీ కళాశాలలో ప్రవేశాల కోసం నిర్వహించిన తెలంగాణ ఈఏపీసెట్ పరీక్ష ఫలితాల్లో కర్నూలు జిల్లా విద్యార్థులు హవా కొనసాగించారు. హైదరాబాద్ విద్యార్థులకు తీసిపోనివిధంగా ఉత్తమ మార్కులు, ర్యాంకులు సాధించి ఔరా అనిపించారు. తెలంగాణ ఎంసెట్ ఇంజనీరింగ్ విభాగంలో కర్నూలు నగరానికి చెందిన గొల్ల లేఖహర్షకు 152.086 మార్కులతో స్టేట్ 2వ ర్యాంకు సాధించారు. కర్నూలు నగరం పంచలింగాల స్కంద గార్డెన్స్‌లో నివాసం ఉంటున్న సూర్య కుమార్, సుహాసిని దంపతుల కుమారుడు లేఖహర్ష సత్తా చాటాడు. ఆదోని టౌన్‌కు చెందిన రామసుబ్బారెడ్డి, రాజేశ్వరి ఆదోనిలో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వారి కుమారుడు సందేశ్ రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు సాధించాడు. అదేవిధంగా కర్నూలు నగరంలోని మారుతి నగర్‌లో నివాసం ఉంటున్న రామేశ్వరరెడ్డి కుమారుడు సాయి యశ్వంత్ రెడ్డి 145.464 మార్కులతో స్టేట్ 5వ ర్యాంకు సాధించాడు. ఇక ఆదోని పట్టణానికి చెందిన మరో విద్యార్థి కూడా సత్తా చాటాడు.

కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగే లక్ష్యం



తెలంగాణ ఎంసెట్ ఇంజనీరింగ్ విభాగంలో కర్నూలుకు చెందిన గొల్ల లేఖహర్షకు 152.086 మార్కులతో స్టేట్ 2వ ర్యాంకు సాధించారు. కర్నూలు నగరం పంచలింగాల స్కంద గార్డెన్స్‌లో నివాసం ఉంటున్న సూర్య కుమార్, సుహాసిని దంపతులు నివాసం ఉంటున్నారు. సూర్యకుమార్ వైజాగ్‌లోని పోలీస్ కమ్యునికేషన్ విభాగంలో ఎస్పీ కేడర్ స్థాయిలో పనిచేస్తున్నారు. వారి కుమారుడు గొల్ల లేఖహర్ష 1 నుంచి 6వ తరగతి వరకు కర్నూలు కృష్ణానగర్‌లోని కేశవరెడ్డి పాఠశాలలో చదివారు. 7 నుంచి 10వ తరగతి వరకు గుడివాడ కేకే గౌతమి పాఠశాలలో విద్యనభ్యసించారు. విజయవాడ శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్‌లో చదివి 952 మార్కులు సాధించారు. జేఈఈ-మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 311వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా గొల్ల లేఖహర్ష మాట్లాడుతూ జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో బెస్టు ర్యాంకు సాధించి ముంబై, చెన్నై వంటి ప్రముఖ విద్యాసంస్థల్లో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో చేరాలన్నదే తన లక్ష్యమని వెల్లడించారు. ఉత్తమ ర్యాంకు రావడానికి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు తను చదివిన విద్యాసంస్థల్లో అధ్యాపకుల కృషే కారణమన్నారు.

- గొల్ల లేఖ హర్ష తెలంగాణ ఎంసెట్ ఇంజనీరింగ్ విభాగంలో స్టేట్ 2వ ర్యాంకు

ప్రజలకు సేవ చేయాలని ఉంది



సివిల్ సర్వీసుకు ఎంపికై పేద ప్రజలకు సేవ చేయాలనే సంకల్పం ఉంది. మా పేరెంట్స్ కూడా అటు వైపు నన్ను ప్రోత్సహిస్తున్నారు. నాన్న రామేశ్వరరెడ్డి స్కూల్ బ్యాగ్స్ బిజినెస్ చేస్తున్నారు. అమ్మ గృహిణి. 1 నుంచి ఇంటర్ వరకు గుంటూరు బాష్యం విద్యాసంస్థలో కొనసాగింది. 10వ తరగతి పరీక్షలో 573 మార్కులు సాధించా. ఇంటర్‌లో 980 మార్కులు వచ్చాయి. జేఈఈ-మెయిన్స్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో ఈడబ్లూఎస్ కేటగిరిలో 36వ ర్యాంకును సాధించా. జేఈఈ-అడ్వాన్స్‌డ్ టెస్టుకు ప్రిపేర్ అవుతున్నా. బెస్టు ర్యాంకు సాధించి అత్యుత్తమ విద్యాసంస్థలో బీటెక్‌లో సీఎస్ఈలో చేరాలని ఉంది.

- ముద్రసాని సాయి యశ్వంత్ రెడ్డి, స్టేట్ 5వ ర్యాంకు ఇంజనీరింగ్ విభాగం

తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో ఆదోని వాసికి 4వ ర్యాంక్


సందేశ్

ఆదోని (అగ్రికల్చర్): తెలంగాణ రాష్ట్ర ఈఏపీ సెట్ (ఎంసెట్)-2024 ఫలితాలను ఆ రాష్ట్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసింది. ఈ ఫలితాల్లో కర్నూలు జిల్లా ఆదోని పట్టణానికి చెందిన బి.సందేశ్ సత్తా చాటాడు. హైదరాబాద్ నారాయణ జూనియర్ కళాశాల మాదాపూర్ బ్రాంచ్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్న బి.సందేశ్ తెలంగాణ ఈఏపీ సెట్ ఫలితాల్లో 4వ ర్యాంకు సాధించాడు. బి.సందేశ్ తల్లిదండ్రులు రామసుబ్బారెడ్డి, రాజేశ్వరి ఆదోనిలో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. తమ కుమారుడు రాష్ట్ర స్థాయిలో నాలుగో ర్యాంకు సాధించడంపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ పరీక్షల ఫలితాల్లో కూడా సందేశ్ 99.99% మార్కులు సాధించి, 252 ఆల్ ఇండియా ర్యాంక్ సాధించాడు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు సాధించి ఐఐటీ ముంబాయిలో సీఎస్‌సీ చేరుతానని ర్యాంకు సాధించిన బి.సందేశ్ తెలిపారు. కాగా ఇంటర్మీడియట్‌లో 987 మార్కులు రాగా.. పదో తరగతిలో 10/10 సాధించినట్లు తెలిపారు.

నిరంతరం నిఘా ఉంచండి


ఆర్‌యూలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీలు

కర్నూలు(కలెక్టరేట్), మే 18: రాయలసీమ యూనివర్సిటీలోని ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల వద్ద నిరంతర నిఘా ఉండాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన అధికారులను ఆదేశించారు. శనివారం రాయలసీమ యూనివర్సిటీలోని కంట్రోల్ రూమ్‌లో స్ట్రాంగ్ రూమ్‌ల లైవ్ ఫీడ్ ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ ఏర్పాట్లు, మీడియా సెంటర్ ఏర్పాట్లను కలెక్టర్‌తోపాటు జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లైబ్రరీ బ్లాకులోని పత్తికొండ, మంత్రాలయం నియోజకవర్గానికి సంబంధించి ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. ఈ స్ట్రాంగ్ రూముల నుంచి కౌంటింగ్ కోసం బయటకు తెచ్చే ఈవీఎంలను భద్రతా నిమ్మితం ప్రత్యేక గ్యాంగ్వే తరహాలో బ్యారికేడింగ్‌లను ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ సంబంధిత నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో (ఇండోర్ స్టేడియం) మీడియా ప్రతినిధుల కోసం మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. మీడియా సెంటర్‌లో టీవీలు, కంప్యూటర్, ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేయాలని సమాచార శాఖ అధికారిని ఆదేశించారు. వీరి వెంట పత్తికొండ ఆర్వో రామలక్ష్మి, మంత్రాలయం ఆర్వో మురళి, తదితర పోలీసు అధికారులు ఉన్నారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేయాలి
ఆర్ఓ ఎ.భార్గవతేజ

కర్నూలు(న్యూసిటీ), మే 18: కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు పాటిస్తూ జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కర్నూలు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి ఎ.భార్గవతేజ సూచించారు. శనివారం నగర శివారులోని రాయలసీమ యూనివర్సిటీలో 137 కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన స్ట్రాంగ్‌రూమ్‌ను అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లాకళ్యాణితోపాటు ఆర్ఓ సందర్శించారు. విధుల నిమిత్తం కేటాయించిన అన్ని విభాగాల అధికారులు, పోలీస్ సిబ్బంది విధి నిర్వహణ, పని తీరుపై ఆర్ఓ ఆరా తీశారు. స్ట్రాంగ్ రూమ్‌కు వేసిన సీళ్లను పరిశీలించి, పోలీస్ సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు నాటికి ఎలాంటి సాంకేతిక సమస్యలు లేకుండా చూసుకోవాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మోహన్‌కుమార్‌ను ఆదేశించారు. అనంతరం సంబంధిత రిజిస్టర్‌లో సంతకం చేశారు.

చిన్న పిల్లలకు టీకాలు తప్పక వేయించాలి


చిన్నారికి టీకాలు వేస్తున్న డీఎంహెచ్‌వో

కర్నూలు(హాస్పిటల్), మే 18: చిన్న పిల్లలందరికీ తల్లిదండ్రులు తప్పక వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని డీఎంహెచ్‌వో డా.ప్రవీణ్ కుమార్ తెలిపారు. నగరంలోని ఇందిరాగాంధీనగర్ 1వ సచివాలయంలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. పిల్లలకు టీకాలు ఎంతో దోహదపడుతాయనీ తెలిపారు. గర్భవతులు, 5 సంవత్సరాలలోపు పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పకుండా ఇవ్వాలని, ఆ వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేయాలని తెలిపారు. దీని వల్ల పిల్లలను వ్యాధుల బారిన పడకుండా కాపాడవచ్చునన్నారు. అనంతరం గర్భవతులు, బాలింతలు చిన్న పిల్లలు ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి నాగసౌమ్యారెడ్డి, డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

బాధ్యతతో విధులు నిర్వహించాలి


జిల్లా కలెక్టర్ డా.జి.సృజన

కర్నూలు(కలెక్టరేట్), మే 18: ఎన్నికల కమిషన్ గైడెన్స్ ప్రకారం కౌంటింగ్ విధులను బాధ్యతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4న జరగనున్న కౌంటింగ్ ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్‌లను ప్రొసీజర్ ప్రకారం చేయాల్సి ఉంటుందన్నారు. పార్లమెంటుకు సంబంధించిన ఈవీఎం కౌంటింగ్ ఒక రూములో అసెంబ్లీకి సంబంధించిన ఈవీఎం కౌంటింగ్ ఒక రూములో చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికల కమిషన్ గైడెన్స్ ప్రకారం ప్రతి కౌంటింగ్ హాలులో 14 కౌంటింగ్ టేబుల్స్, 1 రిటర్నింగ్ అధికారి టేబుల్ ఉంటుందన్నారు. 14 టేబుళ్లలో ఒక టేబుల్‌పై మెష్ ఎంక్లోజర్‌తో కూడిన వీవీ ప్యాట్ కౌంటింగ్ బూత్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రిటర్నింగ్ అధికారులతో సమన్వయం చేసుకుని వీవీ ప్యాట్ కౌంటింగ్ బూత్ ఏర్పాటు చేసే పనులు రేపటి నుంచి మొదలు పెట్టాలని ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, టిడ్కో ఎస్ఈలను ఆదేశించారు. కౌంటింగ్ సిబ్బందికి, కౌంటింగ్ ఏజెంట్లకు కౌంటింగ్ హాల్ లోపలికి ఫోన్లు అనుమతించమని స్పష్టం చేశారు. ప్రతి కౌంటింగ్ హాలు వద్ద ఒక మొబైల్ డిపాజిట్ సెంటర్‌ను ఏర్పాట చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మీడియా సెంటరులో కౌంటింగ్ ప్రక్రియ కనిపించే విధంగా స్క్రీన్ ఏర్పాటు చేస్తామన్నారు. ట్రెజరీ స్ట్రాంగ్ రూములలో భద్రపరిచిన పోస్టల్ బ్యాలెట్‌లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కౌంటింగ్‌కు 24 గంటల ముందుగా క్లోజ్డ్ వెహికల్‌లో ట్రాన్స్‌పోర్టు ద్వారా యూనివర్సిటీ వద్దకు తీసుకుని వచ్చి రూములో భద్రపరచాలని పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారిని ఆదేశించారు. సమావేశంలో పాణ్యం ఆర్వో, జేసీ నారపురెడ్డి మౌర్య, కర్నూలు ఆర్వో, నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని ఆర్వో, సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ, అదనపు ఎస్పీ నాగరాజు, కోడుమూరు ఆర్వో, కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, పత్తికొండ ఆర్వో రామలక్ష్మి, ఎమ్మిగనూరు ఆర్వో చిరంజీవి, మంత్రాలయం ఆర్వో మురలి, ఆలూరు ఆర్వో రాము నాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామి అలంకారంలో
జ్వాలా నరసింహ స్వామి


వేణుగోపాలస్వామి అలంకారంలో జ్వాలా నరసింహస్వామి

ఆళ్లగడ్డ, మే 18: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఎగువ అహోబిలంలో జ్వాలా నరసింహస్వామి భక్తులకు వేణుగోపాలస్వామి అలంకారంలో భక్తులకు శనివారం దర్శనమిచ్చారు. వైశాఖ మాస నృసింహస్వామి జయంతి బ్రహ్మోత్సవాలు వేద మంత్రోచ్చారణల మధ్య ఘనంగా జరుగుతున్నాయి. ఇందులోభాగంగా వేకువ జామున్నే ఉత్సవమూర్తి జ్వాలా నరసింహస్వామిని విశేషంగా అలంకరించి పూజల అనంతరం అభిషేకించారు. స్వామి వారిని వేణుగోపాలస్వామి అలంకారంలో వేదపండితులు అలంకరణ చేసి మాఢవీదుల్లో విహరింప చేశారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

ఖాతాదారుడి ఖాతాలో రూ.5లక్షలు మాయం
పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు


వివరాలు వెల్లడిస్తున్న బీసీ పాయింట్ నిర్వాహకుడు, బాధితుడు షేక్ ఇబ్రహీం

ఎమ్మిగనూరు, మే18: కర్నూలు జిల్లాలో సైబర్ నేరగాళ్ల చెలరేగిపోతున్నారు. తాజాగా ఎమ్మిగనూరు మండలంలోని కోటేకల్లు గ్రామానికి చెందిన షేక్ ఇబ్రహీం అనే బ్యాంకు ఖాతాదారుడి నుంచి సైబర్ నేరగాళ్ల రూ.5లక్షలు కొట్టేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. కోటేకల్ గ్రామానికి చెందిన షేక్ ఇబ్రహీం ఎమ్మిగనూరులో యునియన్ బ్యాంకుకు చెందిన బీసీ పాయింట్(బిజినెస్ కరస్పాండెంట్) నిర్వహిస్తున్నాడు. ఇందులో బాగంగా శుక్రవారం ఎమ్మిగనూరు పట్టణంలోని బ్యాంకుకు వచ్చిన సమయంలో సెల్‌ఫోన్‌ను హ్యాక్ చేసి ఈ బ్యాంకింగ్ ద్వారా ఇతర ఖాతాలకు నగదును సైబర్ నేరగాళ్ల బదిలీ చేసుకున్నట్లు ఇబ్రహీం తెలిపాడు. తన ఖాతాలో డబ్బు మాయం కావడాన్ని గుర్తించి ఏ బ్యాంకు ఖాతాలకు నగదు బదిలీ అయిందో వాటి వివరాలను సేకరించాడు. రాజస్థాన్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుఖాతాకు, హరియాణకు చెందిన బ్యాంకు ఖాతాకు నగదు జమ అయినట్లు గుర్తించాడు. శనివారం ఎమ్మిగనూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసి వివరాలను అందించాడు. పట్టణ పోలీసులు బీసీ పాయింట్ నిర్వాహకుడి ఫిర్యాదుపై దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవలి కాలంలో సైబర్ నేరగాళ్ల జనం బ్యాంకు ఖాతాలనుంచి నగదును మాయం చేస్తుండటంతో ఖాతాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బుల్లెట్ బైక్ ధ్వంసం.. కేసు నమోదు

కొలిమిగుండ్ల రూరల్, మే 18: మండలంలోని బెలుం గ్రామంలో పాత కక్షలు మనుసులో పెట్టుకొని లక్ష్మీనారాయణ అనే వ్యక్తికి సంబంధించిన బుల్లెట్ బైక్ ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు కొలిమిగుండ్ల ఏఎస్ఐ గోవిందనాయక్ శనివారం తెలిపారు. లక్ష్మీనారాయణ తన ఇంటి వద్ద బైక్ పార్కు చేసి ఉండగా అదే గ్రామానికి చెందిన చాకలి చిన్నకుళాయి, వరలక్ష్మి, పోతరాయుడు, అనే వ్యక్తులు ఇంటి వద్ద రస్తా విషయంలో మనుసులో ఉంచుకొని బైక్‌పై కర్రలతో దాడి చేశారని, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెల్లడించారు.

గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి మోహన్ రెడ్డి


డా.జి.మోహన్ రెడ్డి

కర్నూలు(హాస్పిటల్), మే 18: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతిగా డా.జి.మోహన్‌రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వి.వెంకటరంగారెడ్డి సమక్షంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఖాళీగా ఉన్న గ్యాస్ట్రో ఎంట్రాలజీ ప్రొఫెసర్ పోస్టుకు ఆయన్ను నియమించారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి డా.మోహన్‌రెడ్డి 6వ హెచ్‌వోడీగా కొనసాగనున్నారు. నూతనంగా హెచ్‌వోడీగా బాధ్యతలు చేపట్టిన డా.మోహన్ రెడ్డికి ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు అభినందనలు తెలిపారు.

ఆయిల్ ఫామ్ సాగుతో ఆదాయం

● రాయితీలను సద్వినియోగం చేసుకోండి
● ఉద్యానశాఖ అధికారి రామాంజనేయులు

కర్నూలు(అగ్రికల్చర్), మే 18: జిల్లాలోని రైతులు మార్కెట్లో ధర ఎక్కువగా ఉండే పంటలపై దృష్టి సారించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రామాంజనేయులు సూచించారు. కర్నూలు జిల్లాలో ఆయిల్ ఫామ్ పంట సాగుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయనీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పంట సాగుకోసం అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నాయని తెలిపారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ... కర్నూలు జిల్లాలో క్రిష్ణగిరి, ఆదోని, కర్నూలు, సీ.బెళగల్, హొళగుంద, గోనెగండ్ల, కోసిగి, మంత్రాలయం, కౌతాళం, ఎమ్మిగనూరు, నందవరం, పెద్దకడుబూరు, హాలహర్వి మండలాల్లో ఆయిల్ ఫామ్ సాగుకు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిందని తెలిపారు. ఈ మండలాల్లో ఆయిల్ ఫామ్ సాగుకు కంపెనీలను కూడా ప్రభుత్వం అలాట్ చేసిందన్నారు. పతంజలి ఫుడ్ లిమిటెడ్‌కు సి.బెళగల్, గోనెగండ్ల మండలాలను ప్రభుత్వం కేటాయించిందన్నారు. అదేవిధంగా ఎమ్మిగనూరు, ఆదోని, కర్నూలు, క్రిష్ణగిరి మండలాలకు నవభారత్ కంపెనీకి, మంత్రాలయం, హాలహర్వి, కోసిగి, నందవరం, హొళగుంద, పెద్దకడుబూరు మండలాలను లివింగ్ ఫుడ్స్ సంస్థకు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఇప్పటికే పతంజలి ఫుడ్స్ సంస్థ సీ.బెళగల్ మండలంలో రైతుల చేత ఆయిల్‌ఫామ్ సాగుకు చర్యలు చేపట్టిందన్నారు.

హెక్టారుకు రూ.21వేల రాయితీ

ఆయిల్ ఫామ్ సాగు కోసం రైతులకు ప్రభుత్వం హెక్టారుకు రూ.21వేల రాయితీ ఇస్తోందన్నారు. ఏడాదికి రూ.5,250ల ప్రకారం నాలుగేళ్ల ఈ రాయితీని రైతులకు అందిస్తుందని, నేషనల్ మిషన్ ఆన్ ఆయిల్ సీడ్స్ అండ్ ఆయిల్ ఫామ్ ఈ రాయితీని అందిస్తోందన్నారు. ఆయిల్ ఫామ్ పంట సాగుకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వేసవి శిక్షణా శిబిరాలు ప్రారంభం

కర్నూలు(స్పోర్ట్స్), మే 18: కర్నూలు నగర పాలక సంస్థ సహకారంతో డీఎస్ఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు పిలుపునిచ్చారు. శనివారం శిక్షణా శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 15వ తేదీ వరకు ఈ శిక్షణా శిబిరాలు కొనసాగుతాయన్నారు. 8 నుంచి 16 సంవత్సరాల బాలబాలికలు వివిధ క్రీడాంశాలలో వారికి నచ్చిన శిక్షణకు హాజరు కావచ్చని తెలిపారు. ఎయిర్ రైఫిల్ షూటింగ్, అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, కిక్ బాక్సింగ్, కబడ్డీ, రగ్బీ, సీలంబమ్, సెపక్‌తక్రా, తైక్వాండో, చౌక్‌బాల్, వాలీబాల్, ఉషూ, యోగా తదితర విభాగాల్లో శిక్షణ ఉంటుందన్నారు.

కాన్వకేషన్‌కు 31 వరకు దరఖాస్తులు

కర్నూలు(అర్బన్), మే 18: రాయలసీమ యూనివర్సిటీలో జూన్‌లో 4వ కాన్వకేషన్‌నిర్వహించనున్నట్లు ఉపకులపతి బీ సుధీర్ ప్రేమ్ కుమార్ తెలిపారు. 2022-23 విద్యా సంవత్సరం ముగిసే నాటికి అర్హత సాధించిన విద్యార్థులు కాన్వకేషన్‌కు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించడానికి ఈ నెల 31 వరకు మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు.

మద్దిలేటి స్వామి క్షేత్ర ఆదాయం రూ.6.77 లక్షలు

బేతంచెర్ల, మే 18: మద్దిలేటి నరసింహస్వామి క్షేత్ర ఆదాయం రూ.6.77 లక్షలు సమకూరినట్లు ఉప కమిషనర్, ఆలయ నిర్వహణాధికారి రామాంజనేయులు, చైర్మన్ సీతారామచంద్రుడు శనివారం తెలిపారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు ఉమ్మడి జిల్లాల నుంచే గాక తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు వేకువజాము నుంచే స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, గండ దీపాలు, ప్రత్యేక పూజలు చేసి పుట్టు వెంట్రుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్వామి సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, కేశఖండన, రూము బాడుగలు, లీజుల వసూళ్ల ద్వారా రూ.6,77,315 దేవస్థానానికి ఆదాయం లభించినట్లు వారు తెలిపారు.

గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి పెరిగిన రోగులు
కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.వి.వెంకట రంగారెడ్డి


మాట్లాడుతున్న డా.వి.వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్), మే 18: గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి వచ్చే రోగుల సంఖ్య పెరిగిందని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా.వి.వెంకటరంగారెడ్డి అన్నారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయిలో రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. 2015 నుంచి ఈ విభాగాలు దినదినాభివృద్ధి చెందుతూ వస్తున్నాయని, ఇప్పటి వరకు 9 మంది పీజీలు కోర్సును పూర్తి చేసుకుని వైద్యులుగా బయటకు వెళ్లారని అన్నారు. ప్రతి రోజూ 60 మంది రోగులకు చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ఇటీవల రూ.32 లక్షలతో ఎండోస్కోపి, కొలానోస్కోపి, ఈఆర్‌సీపీ స్కోపి పరికరాలను అందుబాటులోనికి తెచ్చి రోగులకు సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మెడిసిన్ ప్రొఫెసర్ విద్యాసాగర్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ దీపక్, ఆర్షియా, సందీప్ కుమార్ రెడ్డి, పీజీలు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వెస్ట్రన్ కాలనీలో చిరుత సంచారం

సీ టైప్ క్వార్టర్స్ కుక్కపై దాడి

శ్రీశైలం, మే 18: శ్రీశైలం మండలం సుండిపెంట గ్రామంలోని వెస్ట్రన్ కాలనీలో చిరుత సంచారం కలకలం రేపింది. వెస్ట్రన్ కాలనీలోని సీ టైప్ క్వార్టర్స్‌లో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ పెంపుడు కుక్కపై చిరుత దాడి చేసి చంపేసింది. ఈ ఘటనతో స్థానికులు భయబ్రాంతులకు గురై అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి చిరుత సంచరించిన గుర్తులను సేకరించారు. ఉన్నతాధికారులకు సమాచారం అందజేశారు. అటవీ ప్రాంతానికి సమీపంలో ఉంటున్న వారు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు అవగాహన కల్పించారు. అదేవిధంగా చిరుతను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.


చిరుత దాడిలో మృతి చెందిన కుక్కను పరిశీలిస్తున్న అధికారులు



సోమశేఖర్‌కు డాక్టరేట్



కర్నూలు(అర్బన్), మే 18: నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర అధ్యాపకులుగా పని చేస్తున్న సింగంశెట్టి సోమ శేఖర్ రాయలసీమ యూనివర్సిటీలో డాక్టరేట్ పొందారు. వర్సిటీ సహాయ ఆచార్యులు డా. గునేటి శ్రీరంగ నాయకులు పర్యవేక్షణలో హంద్రీ నదిలో మురుగు నీటితో సాగు చేయబడుతున్న పాలకుర, తోటకూరల్లో అధిక మోతాదులో చేరుతున్న భార లోహాలు, వాటి పర్యావసానం అనే అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ అవార్డు ప్రదానం చేశారు. డాక్టరేట్ అందుకున్న సోమశేఖర్ తన గైడ్ రాయలసీమ వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ బీ. సుధీర్ ప్రేమ్‌కుమార్, రీసెర్చ్ డైరెక్టర్ ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డి, కాలేజీ ప్రిన్సిపాల్ సీవీ కృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన

కోడుమూరు (రూరల్), మే 18: మండలంలోని పులకుర్తి గ్రామంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం పంచామృతాభిషేకం, పుష్పార్చన, ఆకుపూజ నిర్వహించారు. స్వామిఅమ్మవార్లను పట్టువస్త్రాలు, పూల మాలలతో ముస్తాబు చేశారు. సాయంత్రం స్వామిఅమ్మవార్లను ఊరేగించారు. కార్యక్రమంలో ఎల్లయ్య, బ్రహ్మయ్య, ఈశ్వరయ్య, బ్రహ్మయ్యచారి, ఈరన్న, రంగస్వామి, మల్లిఖార్జున, జ్ఞానేంద్ర తదితరులు పాల్గొన్నారు.



స్వామివారిని ఊరేగిస్తున్న దృశ్యం

పంట నష్టం పరిహారం విడుదల

కోడుమూరు (రూరల్), మే 18: గతేడాది ఖరీఫ్ పంట నష్టపరిహారం సొమ్ము విడుదల అయినట్లు వ్యవసాయాధికారి రవిప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ, తీవ్ర వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం కరువు మండలం కింద ప్రకటించిందని తెలిపారు. మండలంలో సుమారు 9716 హెక్టార్లలో 13,901 మంది రైతులకు రూ. 12,91,98,781 మంజూరైనట్లు తెలిపారు. పరిహారం సొమ్ము రైతుల ఖాతాలకు జమ అయినట్లు తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

సి. బెళగల్, మే 18: ఇసుక నదితీర గ్రామాలలో అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఎస్ఐ తిమ్మారెడ్డి అన్నారు. శనివారం ఎస్ఐ మాట్లాడుతూ మాలేసోమాపురం నుంచి కొత్త కోట వరకు పోలీసులు ప్రత్యేకంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లపై ఎంతటి వారినైనా వదలే ప్రసక్తి లేదన్నారు.

ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవు



గ్రామస్థులతో మాట్లాడుతున్న
సీఐ మన్సూరుద్దీన్, ఎస్ఐ హనుమంతయ్య

గూడూరు, మే 18: గ్రామాల్లో ఘర్షణలకు పాల్పడితే.. చర్యలు తప్పవని కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్, గూడూరు ఎస్ఐ హనుమంతయ్య అన్నారు. శనివారం గూడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని మునగాల, గుడిపాడు గ్రామాల్లో పర్యటించారు. అనంతరం వారు గ్రామస్థులతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పూర్తయిందని, జూన్ 4న కౌంటింగ్ జరగనుందని.. ఈ నేపథ్యంలో ఎవరైనా గ్రామాల్లో బెట్టింగ్‌లకు పాల్పడి.. ఘర్షణలకు దిగితే.. కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నారాయణ కళాశాల విద్యార్థుల ప్రతిభ



నారాయణ కళాశాల విద్యార్థులతో అధ్యాపకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 18: తెలంగాణ ఈఏపీ సెట్ ఫలితాల్లో కర్నూలు నారాయణ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అగ్రికల్చర్ విభాగంలో టి.ఫణిందర్ రెడ్డి 63, పీఎం ఇర్ఫాన్ 95వ ర్యాంకుతో పాటు 174, 318, 346, 347, 373, 400, 404, 407 ర్యాంకులు సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో షాహీద్ ఆలీఖాన్ 240వ ర్యాంకు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల డీజీఎం ఎంటీ గోవర్దన్ రెడ్డి, డీన్స్ ఆంజనేయులు రెడ్డి, విశ్వనాథ రెడ్డి, ప్రిన్సిపాల్స్, లెక్చరర్లు అభినందించారు.

వైద్యాధికారులపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

సి. బెళగల్, మే 18: మండల వైద్యాధికారులపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలోని పోలకల్లు, సిబెళగల్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలో నలుగురు వైద్యులు పని తీరుపై ఎంపీపీ బొంతల మునెప్ప మండిపడ్డారు. మండల సమావేశం ఉన్నా ఏ అధికారులు హాజరు కావడం లేదన్నారు. గ్రామాల్లో కూడా ప్రజలకు వైద్య సేవలు అంతంత మాత్రమే అందిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని ఎంపీపీ అన్నారు. గ్రామాల్లో నీటి సమస్య రానివ్వకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలు కురుస్తున్నాయని, గ్రామాల్లోని డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

చాగలమర్రి, మే 18: మండలంలోని మల్లేవేముల గ్రామ సమీపంలో కుందూతీరం వద్ద వెలసిన చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా 25న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి శనివారం తెలిపారు. దాతల సహకారంతో బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశామని అన్నారు. ఈ పోటీలో గెలుపొందిన వృషభరాజములకు మొదటి బహుమతి రూ.1.10 లక్షలు, రెండో బహుమతి రూ.75 వేలు, మూడో బహుమతి రూ.50 వేలు, నాల్గో బహుమతి రూ.30 వేలు, ఐదో బహుమతి రూ.20 వేలు, ఆరో బహుమతి రూ.10 వేలు ప్రోత్సాహక బహుమతులు అందజేయబడతాయని అన్నారు.

శాశ్వత అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం, మే 18: శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకానికి శనివారం హైదరాబాద్‌కు చెందిన కె. నాగవెంకటేశ్వరరావు అనే భక్తుడు రూ. 1,01,116 విరాళాన్ని పర్యవేక్షకురాలు హిమబిందుకు అందజేశారు. అలాగే బెంగళూరుకు చెందిన పీవీ రవీంద్ర అనే భక్తుడు కుటుంబ సమేతంగా కలిసి రూ. లక్ష విరాళాన్ని ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి ఫణిధర్‌ప్రసాద్‌కు అందజేశారు. దేవస్థానం అధికారులు దాతకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్ర పటాన్ని అందజేసి సత్కరించారు.

20 నుంచి చెన్నకేశవ స్వామి ఉత్సవాలు





ఓర్వకల్లులో వెలసిన చెన్నకేశవ స్వామి ఆలయం

ఓర్వకల్లు, మే 18: ఓర్వకల్లులో వెలసిన శ్రీదేవి భూదేవి సహిత చెన్నకేశవస్వామి మహోత్సవాలు 20 నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ వాసుదేవ రెడ్డి, ఆలయ కార్యనిర్వాహణ అధికారి మద్దిలేటి శనివారం తెలిపారు. 20న వైశాఖ శుద్ధ ద్వాదశి గణపతి పూజ, షష్టి వాచకం, కుంకుమారోహణం, ధ్వజారోహణం, ఉదయం 5.21 తెల్లవారుజామున కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. 21న ఉదయం ప్రత్యేక పూజ, దేవయాగం, బలిహరణం, సాయంత్రం 6 గంటలకు అనుద్వాహనం ద్వారా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. 22న వైశాఖ శుద్ధ చతుర్దశి ప్రాతఃకాల పూజ అర్చన, హోమం, బలిహరణం, సాయంత్రం 4 గంటలకు ప్రభోత్సవం, గరుడోత్సవం, సాయంత్రం 6 గంటలకు చెక్కభజన రామ కృష్ణ బృందంతో, 23న వైశాఖ శుద్ధ పౌర్ణమి ఉదయం, సాయంత్రం పూజాదీక్ష హోమం, బలిహరణం, సాయంత్రం రథాంగ హోమం, 5.30 గంటలకు రథోత్సవం, 24న వైశాఖ బహుళ పాడ్యమి ఉదయం 8 గంటలకు వసంతోత్సవం, మద్యాహ్నం పూర్ణాహుతి, సాయంత్రం 6 గంటలకు ధ్వజారోహణం, పారువేట కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ఈవో మద్దిలేటి తెలిపారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైంది

● బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామక్రిష్ణ



కర్నూలు(అర్బన్), మే 18: ఐదేళ్ల వైసీపీ పాలన రాష్ట్రం అన్ని రంగాలను సర్వనాశనం చేసిందని బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామక్రిష్ణ ధ్వజమెత్తారు. శనివారం నగరంలోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి పాలనలో సామాన్యుడికి పన్నుల భారంతో కంటి మీద కనుకు లేకుండా చేసిందని, మరో వైపు ల్యాండ్ టైటిలింగ్ పేరుతో ఆస్తులను తాకట్టు పెట్టేందుకు పన్నిన కుట్రలను తెలుగుదేశం పార్టీ బట్టబయలు చేసిందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా.. ప్రజలు సుఖంగా జీవించాలన్నా ఒక్క చంద్రబాబు పాలనలోనే సాధ్యమన్నారు. పోలింగ్ తర్వాత ఓటమి భయంతో దాడులకు తెగబడుతున్నారని, ఇది ప్రజాస్వామ్యంలో మంచి పద్ధతి కాదన్నారు.

అక్రమ సస్పెన్షన్‌ను రద్దు చేయాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు

కర్నూలు(న్యూసిటీ), మే 18: ఏపీఎస్ ఆర్టీసీలో పని చేస్తున్న యూనియన్ రాష్ట్ర నాయకుల అక్రమ సస్పెన్షన్ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు డిమాండ్ చేశారు. శనివారం కార్మిక కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర నాయకులను సస్పెండ్ చేయడాన్ని సీఐటీయూ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధక్షుడు సీహెచ్.సుందరరావు, బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యాంసన్,ఎన్ఎంయూ తనుకు డిపో కార్యదర్శి సుబ్బారావుపై విధించిన సస్పెన్షన్ అక్రమమైనదన్నారు. ఉద్యోగ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనడం చట్ట విరుద్ధం ఏమి కాదని అన్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఫిర్యాదు లేకున్న కక్షపూరితమైన చర్యలు తీసుకున్నారని మండిపడ్డారు. తక్షణమే సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 30న జరిగే సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జూన్ 8న సీఐటీయూ వ్యవస్థాపక నాయకులు పర్సా సత్యనారాయణ శతజయంతి సభను నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ, నాయకులు సాయిబాబ, విజయ్, గోపాల్, ప్రభాకర్ పాల్గొన్నారు.

దరఖాస్తులు చేసుకున్న ప్రతి విద్యార్థికి సీటు కేటాయించాలి

● ఏపీసీవోకి వినతి పత్రం అందజేసిన ఏఐఎస్ఎఫ్ నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 18: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకున్న ప్రతి విద్యార్థినికి సీటు కేటాయించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.సోమన్న కోరారు. సర్వశిక్ష అభియాన్ అడిషినల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్‌కు ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. డి.సోమన్న మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా చాలా మంది విద్యార్థినులు మంచి చదువుల కోసం క్రమశిక్షణ కోసం కస్తూర్బా బాలికల విద్యాలయాల్లో దరఖాస్తులు చేసుకుంటున్నారని, చాలా మంది విద్యార్థులు ఇప్పటికి ఒక చాన్స్ అయిపోవడం వలన వాటిలోని వారికి సీటు రాకపోవడంతో నిరాశపడుతున్నారన్నారు. వీటితో పాటు ఇది వరకు రాష్ట్ర ప్రభుత్వం కూడా కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో చాలా మంది విద్యార్థినులు తల్లిదండ్రులతో కలిసి సొంత ప్రాంతాలను వదిలి ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారన్నారు. దీంతో వీరి చదువులు మధ్యలోనే ఆగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి వారికి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో సీటు కేటాయించి వారి చదువుకు కృషి చేసేందుకు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్క విద్యార్థికి సీటు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర నాయకులు బాలాజి, షఫీ, సూరి, మౌలాలి, దుర్గన్న తదితరులు పాల్గొన్నారు.

కల్తీ, నాసిరకం విత్తనాల నుంచి రైతులను కాపాడండి



జేడీ వరలక్ష్మికి వినతి పత్రం అందజేస్తున్న
రైతు సంఘం నాయకులు

కర్నూలు(అగ్రికల్చర్), మే 18: నాసిరకం కల్తీవిత్తనాల వల్ల రైతులు ఏటా నష్టపోతున్నారని, ఈసారైన నాణ్యత కలిగిన విత్తనాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, కార్యదర్శి రామక్రిష్ణ డిమాండ్ చేశారు. శనివారం జేడీ వరలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ప్రధాన పంటలైన పత్తి, ఆముదం, మిరప, కంది, మొక్కజొన్న వంటి పంటలకు సంబంధించిన విత్తనాలకు ప్రభుత్వం సబ్సిడీ అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. మరో పది రోజుల్లో ఖరీఫ్ సీజన్ మొదలవుతుండటంతో పత్తి, వరి, మొక్కజొన్న, మిరప, తదితర పంటలకు సంబంధించిన నాసిరకం విత్తనాలను రైతులకు విక్రయించేందుకు వ్యాపారులు, దళారుల ద్వారా రైతులకు అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారని, వారి అక్రమాలను అరికట్టేందుకు తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని జేడీ దృష్టికి తెచ్చారు. 2021 సంవత్సరం ఖరీఫ్‌లో కావేరి కంపెనీకి చెందిన జాదూ రకం విత్తనాలను రైతులకు అంటగట్టి వారిని నిలువునా ముంచేశారని, జిల్లా కలెక్టర్ నష్టపరిహారాన్ని అందించాలని ప్రభుత్వానికి నివేదిక పంపినా ఇప్పటి దాకా రైతులకు పరిహారాన్ని అందించలేదన్నారు. ఇప్పటికైనా జిల్లాలో కల్తీ విత్తనాల బెడద లేకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని వారు జేడీ వరలక్ష్మికి విజ్ఞప్తి చేశారు.

750 ప్లేస్‌మెంట్స్‌తో అశోకా విద్యార్థినుల ప్రభంజనం



జాబ్ ఆఫర్స్ పొందిన విద్యార్థులతో అశోకా యాజమాన్యం

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 18: స్థానిక నగరంలోని ప్రముఖ అశోకా ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజీలో ఈ విద్యాసంవత్సరం ఫైనలియర్‌కు చెందిన బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థినులకు రాయలసీమలోనే అత్యధికంగా 750 జాబ్ ఆఫర్స్ లభించిన సందర్భంగా శనివారం ట్రయంఫ్-2024 (ప్లేస్మెంట్ సక్సెస్ మీట్)ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అశోకా కాలేజీ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్స్ డిపార్టుమెంటు ఆధ్వర్యంలో కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన ట్రయంఫ్-2024 కార్యక్రమానికి అశోకా కళాశాల సీఈవో డా.హరీష్ కృష్ణ, ప్రిన్సిపాల్ డా.ఆర్‌నవీన్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎస్.మధులత 9 జాబ్ ఆఫర్స్, సోహా తబసుమ్ 8, చైతన్య దీప్తి, గ్రీష్మలు 7, అలాగే మరో 26 మంది విద్యార్థినులు 5కి పైగా జాబ్ ఆఫర్స్ సాధించారు. ఈ సందర్భంగా బారీ కేక్ కట్ చేసి డైరెక్టర్, ప్రిన్సిపాల్ చేతుల మీదుగా విద్యార్థులకు మెమెంటోలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్లేస్మెంట్ డీన్స్ జయకర్ జాన్సన్, విజయ్ అమల్ క్రిస్టి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

చాగలమర్రి, మే 18: మండలంలోని మల్లేవేముల గ్రామ సమీపంలో కుందూతీరం వద్ద వెలసిన చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా 25న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి శనివారం తెలిపారు. దాతల సహకారంతో బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశామని అన్నారు. ఈ పోటీలో గెలుపొందిన వృషభరాజములకు మొదటి బహుమతి రూ.1.10 లక్షలు, రెండో బహుమతి రూ.75 వేలు, మూడో బహుమతి రూ.50 వేలు, నాల్గో బహుమతి రూ.30 వేలు, ఐదో బహుమతి రూ.20 వేలు, ఆరో బహుమతి రూ.10 వేలు ప్రొత్సాహక బహుమతులు అందజేయబడతాయని అన్నారు.

స్ట్రాంగ్ రూంల అధికారులు అప్రమత్తంగా ఉండాలి

పాణ్యం, మే 18: మండలంలోని ఆర్జీఎం, శాంతిరాం, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో భద్రపర్చిన పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంల స్ట్రాంగ్ రూంల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టరు డాక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం ఆయనతోపాటు జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జాయింట్ కలెక్టరు రాహుల్‌రెడ్డి, డీఎస్పీ రవీంద్రనాథరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్‌కుమార్‌లు స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కమాండ్ కంట్రోల్ వద్దగల సీసీ టీవీ కెమెరాలు పరిశీలించారు. స్ట్రాంగ్ రూంల వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులకు దిశానిర్దేశం చేస్తూ కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా పటిష్ట భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉందన్నారు. కౌంటిగ్ ప్రక్రియ ఆర్జీఎం, శాంతిరాం ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో ఉంటుందని తెలిపారు. జిల్లాలో హింసాత్మక సంఘటనలకు పాల్పడినా, రెచ్చగొట్టే విధంగా వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 144 సెక్షన్ అమలుతో ఎక్కడా నలుగురు మించి గుంపులుగా ఉండరాదన్నారు. స్ట్రాంగ్‌రూం వద్ద ఏర్పాటు చేసిన మూడంచెల భద్రతా చర్యల్లో ఎలాంటి అలసత్వం ఉండరాదన్నారు. నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణలో పహారా ఉండాలని ఆదేశించారు. డీఎస్పీ స్థాయి అధికారి 24 గంటలపాటు భద్రతను పర్యవేక్షిస్తుంటారని తెలిపారు. విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు పికెట్లు, మొబైల్ పెట్రోలింగ్ పార్టీలు నిరంతరం పని చేసేలా ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. జూన్ 4 వతదీ ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్బీ సీఐ వెంకటేశ్వరరావు, పాణ్యం సీఐ నల్లప్ప, ఎస్ఐ అశోక్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మంత్రాలయం లాడ్జీల్లో ముమ్మర తనిఖీలు

● అదుపులో పలు జంటలు
● కౌన్సెలింగ్ ఇచ్చి పంపించిన పోలీసులు



మంత్రాలయం లాడ్జీలపై తనిఖీలు చేస్తున్న పోలీసులు

మంత్రాలయం, మే 18: మంత్రాలయం పుణ్యక్షేత్రంలో ప్రైవేటు లాడ్జీలపై పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేశారు. శుక్రవారం రాత్రి, శనివారం మధ్యాహ్నం మంత్రాలయం సీఐ ఎరిషావలి ఆధ్వర్యంలో మంత్రాలయం, మాధవరం ఎస్ఐలు గోపినాథ్, కృష్ణమూర్తి, ఏఎస్ఐ ఆనందరెడ్డి అకస్మికంగా తనిఖీలు చేశారు. ఎన్నికల నేపథ్యంలో కర్నాటక, అటు ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన నాయకులు అనుమానితులు మంత్రాలయంలో ఉంటున్నారన్న అనుమానాలు, వివిధ కారణాలతో తనిఖీలు చేశారు. అనుమానితులుగా ఉన్న జంటలను అదుపులోకి తీసుకుని విచారించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేశారు. లాడ్జీల్లో చాలామంది అద్దెకు తీసుకుని అధిక రేట్లకు గదులను కేటాయించడం, అసాంఘీక కార్యకలాపాలు, పేకాట, మద్యం వంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లాడ్జీ యజమానులు పక్కా ఆదారాలతో గదులను అద్దెకు ఇవ్వాలని, సీసీ కెమెరాలు ప్రతి లాడ్జీలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ తనిఖీలో కోదండరామిరెడ్డి, దశరథరాముడు, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు : ఏడీఏ



ఆర్బీకే సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు

కోడుమూరు, మే 18: ఖరీఫ్ సీజన్ సందర్భంగా విత్తన, ఎరువులు, పురుగు మందుల డీలర్స్ కృత్రిమ కొరత సృష్టించి రైతులను ఇబ్బందికి గురి చేస్తే కఠిన చర్యలు తీసుకొంటామని ఏడీఏ సాలురెడ్డి హెచ్చరించారు. స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో శనివారం ఆర్బీకే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువ అమ్మరాదన్నారు. అలాగే లింగ్ ప్రొడక్ట్ ఏది కూడా రైతులకు ఇవ్వకూడదని హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతి ఉన్నటువంటి విత్తన, విత్తన పరీక్ష చేయబడినటువంటి విత్తనాలనే విక్రయించాలని తెలిపారు. గ్రామ స్థాయిలో యాక్షన్ ప్లాన్ చేసుకొని కొత్త పద్ధతుల ద్వారా అధిక దిగుబడి వచ్చే విధంగా రైతులకు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆర్బీకే ఇబ్బందిని ఆదేశించారు. గ్రామీన ప్రాంతాలల్లో నకిలీ విత్తనాలు అరికట్టాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతుల కోసం కోడుమూరు మండలానికి 550 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను కేటాయించడం జరిగిందన్నారు. 20న రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ చేసే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని అన్నారు. అలాగే కందులు, కొర్ర విత్తనాల కొరకు రైతులు ఆర్బీకేలల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రవిప్రకాష్ విస్తరణ అధికారులు తస్లీమా, బాలకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ఓర్వకల్లు, మే 18: కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి 40పై పూడిచెర్ల బస్ స్టేజీ వద్ద శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని నన్నూరు గ్రామానికి చెందిన చాకలి మద్దిలేటి కర్నూలు నుంచి నంద్యాల వైపు ద్విచక్రవాహనంపై వస్తుండగా.. ప్రమాదవశాత్తు కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమ్మితం 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాటు సారా లేకుండా చేయడమే లక్ష్యం



నాటు సారా స్థావరాలను ధ్వంసం చేస్తున్న అధికారులు

కర్నూలు(అర్బన్), మే 18: జిల్లాలో నాటు సారా లేకుండా చేయడమే లక్ష్యంగా పని చేస్తామని సెబ్ సీఐ కేఆర్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. శనివారం స్పెషల్ ఎన్ఫోర్సు మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ ఎస్ రవికుమార్ పర్యవేక్షణలో కొంపల్లి తాండ పరిసరప్రాంతాల్లో నాటు సారా స్థావరాలను ధ్వంసం చేశారు. దాదాపు నాటు సారా తయారీకి నిల్వ ఉంచిన 2500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో టీడీఎఫ్ సీఐ నరసనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి ఉషా శిక్షణ శిబిరం ప్రారంభం



ఉషా వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న
భూపతిరావు తదితర క్రీడా సంఘాల ప్రతినిధులు

కర్నూలు(స్పోర్ట్స్), మే 18: నగరంలోని పెద్ద మార్కెట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నగర పాలక సంస్థ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం ఉషా వేసవి శిక్షణా శిబిరాన్ని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పాలక కమిషనర్ సహాయ సహకారాలతో నగరంలోని 25 వేసవి శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సమానంగా క్రీడాసాధనకు కొంత సమయాన్ని కేటాయించి ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలన్నారు. జిల్లా ఒలంపిక్ సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసులు మాట్లాడుతూ చిన్నారులు వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే జిల్లా ఒలంపిక్ సంఘం సహాయ కార్యదర్శి యోగాచార్య అవినాశ్ శెట్టి, జిల్లా ఉషా సంఘం కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ ఈశిక్షణ శిబిరాల్లో 35 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 8.30 గంటల వరకు ఉషా శిక్షణ కార్యక్రమం ఉంటుందని, వివరాలకు 9440047196లను సంప్రదించాలన్నారు.

యాగంటిలో భక్తుల సందడి

బనగానపల్లె, మే 18: బనగానపల్లె మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన యాగంటిలో శనివారం భక్తుల సందడి నెలకొంది. గత రెండు రోజుల నుంచి భక్తులు యాగంటి క్షేత్రానికి వేలాదిగా వస్తున్నారు. భక్తులు క్యూలైన్ల ద్వారా ఉమామహేశ్వరస్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు వెంకటేశ్వరగవిని దర్శించుకొని వెంకటేశ్వర స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

ఎన్డీఏతోనే అభివృద్ధి

ఆదోని టౌన్, మే 18: ఎన్డీఏతోనే రాష్ట్ర, దేశ అభివృద్ధికి అవకాశం ఉందని రాష్ట్ర వీర శైవ జంగమ హక్కుల పోరాట సమితి నాయకులు శివరాజ్, మల్లికార్జున, భద్రీనాథ్ అన్నారు. శనివారం వీరు మాట్లాడుతూ, రాష్ట్రంలో చంద్రబాబు, కేంద్రంలో మోదీ పాలన కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని, రెండు చోట్ల ఒకే ప్రభుత్వం ఉంటే తక్కువ కాలంలో ఎక్కువ అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. దేశ అభివృద్ధిని కోరుకొంటున్న ఓటర్లు ఈసారి ఎన్డీఏకే అధికారం ఇవ్వాలని నిర్ణయంతోనే ఓటు వేశారని అన్నారు.

ఘనంగా వాసవి మాత జయంతి

ఆదోని టౌన్, మే 18: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం వాసవి అమ్మవారి జయంతి ఉత్సవాలను నగరేశ్వర దేవాలయంలో ఆర్యవైశ్యులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి అమ్మవారికి సామూహిక సంకల్పం, సామూహిక కుంకుమార్చన, పాలాభిషేకం, పల్లకీ సేవ కార్యక్రమాలను ఆర్యవైశ్యులు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. 108 కలశాలతో అమ్మవారి ఉత్సవ విగ్రహాలను భక్తులు ప్రధాన వీధులలో ఊరేగించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కుబడులను తీర్చుకున్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ప్రకాష్, కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి సుబ్రహ్మణ్యం, టీజీ రాంప్రసాద్, సూర్య, మనోహర్, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు సర్వస్వతి, కార్యదర్శి త్రివేణి, కోశాధికారి పుష్పలత ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

మద్దికెర : స్థానిక నగరేశ్వరస్వామి దేవాలయంలో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం స్థానిక మద్దమ్మ బావికి ఆర్యవైశ్య సంఘం మహిళలు వెళ్లి గంగ పూజ చేసి అక్కడి నుంచి మేళతాళాలతో అమ్మవారికి గంగను తెచ్చి దేవాలయంలోని వాసవిమాతకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు సుంకు రవీంద్ర, ముత్యాల రాజశేఖర్ శెట్టి, కాశీ విశ్వనాథ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు

పత్తికొండ, మే 18 : పత్తికొండలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో శనివారం ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేకపూజలు, గ్రామోత్సవం, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం సాయంత్రం బజనకార్యక్రమాలను ఆలయకమిటి ఆధ్వర్యంలో నిర్వహించారు. కాలజ్ఞానవేత్తగా పూజలందుకుంటున్న బ్రహ్మేంద్రస్వామి జీవ సమాధి పొందిన రోజున ఆరాధనోత్సవాలు ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మద్దికెర, మే 18: స్థానిక ఎస్సీ కాలనీ సమీపంలోని ఆలయంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మూలవిరాట్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటాన్ని పల్లకిలో పెట్టి గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.

ఉరుకుంద హుండీ ఆదాయం రూ.72.92లక్షలు

కౌతాళం, మే 18:;మండలంలో ప్రసిద్ద పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో శనివారం స్వామి వారి హుండీ లెక్కింపు కార్యక్రమం ఆలయ డిప్యూటీ కమిషనర్ వెంకటేష్, పాలక మండలి చైర్మన్ నాగరాజుగౌడ్ ఆధ్వర్యంలో కొనసాగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులు స్వామి వారికి సమర్పించిన కానుకల్లో నగదు రూపంలో రూ.72,92,228, బంగారం 66గ్రాముల 700మిల్లి గ్రాములు, వెండి 13.6కిలోలు వచ్చినట్లు తెలిపారు. హుండీ పర్యవేక్షణ అధికారి వెంకటేష్ ఆలయ పాలక మండలి సభ్యులు విజయేంద్ర రెడ్డి, నరసింహులు, రెడ్డి గీత, లక్ష్మిరెడ్డి, నరసమ్మ, రమణి, ఆలయ అర్చక సిబ్బంది, దేవస్థానపు సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీ వేరుశనగకు పేర్లు నమోదు చేసుకోండి

ఆదోని (అగ్రికల్చర్), మే 18: ఈ ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసే రైతులు ప్రభుత్వం రాయితీ కింద అందించే వేరుశనగ కాయల కోసం తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆదోని మండల వ్యవసాయ శాఖ అధికారి అశోక్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆదోని మండలానికి 1,010 క్వింటాళ్ల వేరుశనగ మంజూరు అయింది అన్నారు. 1,500 క్వింటాళ్ల కొర్ర, 5 క్వింటాళ్ల జీలగ విత్తనాలు, 1.5 క్వింటాళ్ల పిల్లి పెసర కేటాయించారని పేర్కొన్నారు.

ఇంగ్లీష్ భాష పై పట్టు ఎంతో అవసరం

ఆదోని టౌన్, మే 18: విద్యార్థి దశలోనే ఇంగ్లీష్ భాషపై పట్టు సాధించడం ఎంతో అవసరమని లక్ష్మమ్మ అవ్వ ఎడ్యుకేషల్ సొసైటీ డైరెక్టర్ ఆర్ఎంజీ రెడ్డి అన్నారు. సొసైటీ తరపున నిర్వహించిన ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ గ్రామర్ క్యాంపు ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో ప్రతిభను కనబరిచిన విద్యార్థులు కీర్తన, పృథ్వీ తేజ, వెంకట శివసాయి, శ్రీదేవి, వంశిక శ్రీ, సాయి నవ్య శ్రీ, అనన్యలకు బహుమతులతో పాటు సర్టిఫికెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మమ్మ బ్యాంక్ వైస్ చైర్మన్ లక్ష్మయ్య శెట్టి, డైరెక్టర్లు సుబ్బయ్య, సురేష్ శెట్టి, నసీరుద్దీన్ పటేల్ పాల్గొన్నారు.

క్షయవ్యాధి పై అవగాహన

ఆదోని టౌన్, మే 18: టీబీ యూనిట్ సిబ్బంది శనివారం పట్టణంలో క్షయవ్యాధి సోకిన వారిని కలిసి, వారి ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు సేకరించారు. ఎంపీహెచ్ఎస్‌లు బాబురాజు, లలితమ్మ రోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ అవగాహన కల్పించారు. వ్యాధి ఇతరులకు సోకకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏఎన్ఎం వరలక్ష్మి, ఆశావర్కర్ అరుణ జ్యోతి పాల్గొన్నారు.

నెల్లూరమ్మకు ప్రత్యేక పూజలు

తుగ్గలి, మే 18: భక్తుల ఇలవేల్పులైన నెల్లూరమ్మతో పాటు గ్రామ దేవతలకు వైభవంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం మండల పరిధిలోని జొన్నగిరిలో గ్రామ ప్రజలు, భక్తులు గ్రామంలోని గ్రామదేవతలకు వడిబియ్యాలు సమర్పించి ఆకుపూజలు చేశారు. అలాగే నెల్లూరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ప్రముఖ వ్యాపారి పార్థసారధి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకుడు విరుపాక్షేశ్వరస్వామి, భజన మండలి సభ్యులు గిడ్డయ్య, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

పత్తికొండ టౌన్, మే 18: పట్టణంలో వేసవి సెలవుల్లోనూ ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు చేయించుకుంటూ అక్రమ ఫీజులు వసూలు చేస్తున్నారని, ఇలాంటి విద్యాసంస్థలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు అల్తాఫ్, జిల్లా కార్యవర్గ సభ్యులు నజీర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆర్డీవో కార్యాలయ అధికారులకు ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాసంవత్సరం పూర్తి కాకమునుపే పట్టణంలో అనేక కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల్లో ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యానిన వీడి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శివ, మాబాషా, రమేష్, మోహన్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తు..నమ్మితే చిత్తు

● పంటల సాగు పనులు మొదలెట్టిన రైతులు
● మార్కెట్లో ముంచెత్తుతున్న నకిలీ విత్తనాలు
● రైతులు అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు



కోసిగి మే 18: ఆరుగాలం శ్రమకు ఫలితం దక్కాలంటే.. ఆది నుంచి అన్నదాత అన్ని విషయాల్లో అప్రమత్తంగా ఉండాలి. దుక్కి, దున్నింది మొదలు పంట చేతికొచ్చే వరకు సాగుకు ప్రతి చోట రైతన్నలు జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా విత్తనాలు కొనుగోలులో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలి. కొందరు డీలర్లు నకిలీ విత్తనాలు, మరికొందరు నకిలీ విత్తనాల ముసుగులో గ్రామాల్లోనే తిష్టవేసి రైతులను ముంచుతున్నారు. వర్షాకాలం ఖరీఫ్‌లో సాగుకు సన్నద్ధమవు తున్న రైతులు జాగ్ర త్తగా ఉండాలని సూచిస్తున్నారు వ్యవసా యాధికారులు. కోసిగి మండలంలోని పల్లెపాడు గ్రామంలో గత ఏడాది జూన్ 20వ తేదీ పర్మిషన్ లేని రూ.3 లక్షలు విలువ చేసే 139 పత్తి విత్తనాల ప్యాకెట్లు, లూజు పత్తి విత్తనాలు, 2వేల ఖాళీ సంచులు, సీలింగ్ మిషన్‌ను విజిలెన్స్ సీఐ నాగరాజు యాదవ్, విజిలెన్స్ ఏవో రూపర్స్ రొనాల్డ్ దాడులు చేసి పల్లెపాడు గ్రామానికి చెందిన సాంబశివరావు, నరసన్న అనే ఇద్దరు వ్యక్తులపైన కేసులు నమోదు చేశారు. గుజరాత్ రాష్ట్రంలో ఉత్పత్తిఅయిన అరుణోదయ అగ్రిక్రాఫ్ట్ ప్రైవేటు లిమిటెడ్ కర్నూలు అడ్రస్‌తో పర్మిషన్ లేకుండా ప్యాకింగ్ చేస్తున్న సమయంలో విజిలెన్స్ అధికారులు పక్కా నిఘాతో దాడులు చేసి విత్తనాలను సీజ్ చేసి కోసిగి పోలిస్‌స్టేషన్‌కు తరలించారు.

అధికారులూ నిఘా పెట్టండి

మంత్రాలయం నియోజకవర్గంలోని కౌతాళం, కోసిగి, పెద్దకడుబూరు, మంత్రాలయంలలో కొందరు తెలంగాణ, మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల వారు వేర్వేరు చోట్ల నకిలీ విత్తనాలను రైతులకు తక్కువ ధరకు అంటగట్టేందుకు చూస్తున్నారు. ముఖ్యంగా కోసిగి మండలంలో పల్లెపాడు, దుద్ది, బెళగల్, చిన్నభోంపల్లి, వందగల్లు, కోల్‌మాన్‌పేట, కందుకూరు చింతకుంట, ఐరెంగల్లు, జంపాపురం గ్రామాల్లో రైతులతో సత్సంబంధాలు పెట్టుకుని నకిలీ విత్తనాల తతంగం జరుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. తక్కువ ధరకు లభిస్తాయన్న ఆశతో రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి పంట దిగుబడి రాక అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు కూడా నియోజకవర్గంలో చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా అక్షరాస్యత లేని కోసిగి మండలంలో వ్యవసాయాధికారులు దాడులు చేయక రైతులు నిలువునా మోసపోతున్నారు. కోసిగిలో పుట్టగొడుగుల్లా విత్తనాలు అమ్మే డీలర్లు పుట్టుకొస్తున్నారు. ఒక్క కోసిగిలోనే సుమారు 50కి పైగా షాపులు ఉన్నాయి. ముందస్తుగానే జిల్లా వ్యవసాయాధికారులు, విజిలెన్స్ అధికారులు గ్రామాల్లో నిఘా ఉంచి నకిలి విత్తనాలు అమ్మేవారిపై దాడులు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరుతున్నారు.



రైతులు పాటించాల్సిన మెళకువలు

లకు వ్యవసాయాధికారులు కొన్ని మెళకువలు పాటిస్తే నకిలి విత్తనాలను నివారించే ఆస్కారం ఉందని సూచిస్తున్నారు. లైసెన్సులు ఉన్న దుకాణాల్లోనే విత్తనాలను కొనుగోలు చేయాలని, విత్తన ప్యాకెట్ సంచి పై ట్యాగ్ చుట్టి ఉంటుందని, దీనిపైన విత్తన నాణ్యమైన ప్రమానాలు ముద్రించి విక్రయిస్తున్నారన్నారు. రైతులు వ్యాపారి నుంచి కొనుగోలు బిల్లులు తీసుకోవాలని, విత్తన సంచికి పసుపు రంగు ట్యాగ్ ఉందో లేదో చూడాలి. ఆ ట్యాగ్‌పై విత్తన భౌతిక స్వచ్ఛత, మొలకెత్తే శాతం, జన్యు నాణ్యత వంటి వివరాలు ఉంటాయి. ఎలాంటి విత్తనాలు కొనుగోలు చేసిన పంట సాగు పూర్తయ్యే వరకు తప్పనిసరిగా ఆ విత్తన ప్యాకెట్లను, బిల్లులను రైతులు జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు.

నకిలీ విత్తనాలపై ప్రత్యేక నిఘా

కోసిగి మండలంలో కొన్నిగ్రామాల్లో నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై ఇప్పటికే నిఘా ఉంచాం. నకిలీ విత్తనాలు అమ్మినట్లు తమదృష్టికి వస్తే. అటువంటి వారిపైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. రైతులు కూడా లైసెన్సు కలిగిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేసి వారి నుంచి బిల్లులను తీసుకుని పంట పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలి.

- రాజు, మండల వ్యవసాయాధికారి

ఆసుపత్రిలో కరెంట్ కట్

● ప్రభుత్వ ఆసుపత్రిలో స్థంభించిన సేవలు
● ఉక్కపోతతలో అల్లాడిన బాలింతలు
● రెండు రోజులుగా నిలిచిన కంటి ఆపరేషన్లు



ఎమ్మిగనూరులోని ప్రభుత్వ ఆసుపత్రి

ఎమ్మిగనూరు, మే18: ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రెండురోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో చికిత్సకోసం వచ్చిన రోగులు, బాలింతలు ఇబ్బందులు పడ్డారు. రెండు రోజులుగా కంటి ఆపరేషన్లు సైతం నిలిచిపోయాయి. దీంతో ఆపరేషన్లకోసం వచ్చిన వారు తిరుగుముఖం పట్టారు. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో విద్యుత్ తీగలు షార్ట్‌సర్క్యూట్‌కు గురై ఆసుపత్రిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చికిత్సకోసం, కాన్పులకోసం వివిద గ్రామాలనుంచి వచ్చిన రోగులు, గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బాలింతలు, పురిటి బిడ్డలు ఉక్కపోతతో అల్లాడారు. రోగుల వెంట వచ్చిన బంధువులు చిన్నపిల్లలు ఆసుపత్రి వెలుపలకు తెచ్చుకొని రాత్రంతా జాగరణ చేయల్సి వచ్చింది. బాత్ రూముల్లో నీటి సరఫరా లేక మల మూత్ర విసర్జనకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తాగునీటి కోసం అవస్తలు పడ్డారు. ఆసుపత్రిలో జనరేటర్ ఉన్న దాన్ని వినియోగించకపోవటం గమనార్హం.

రెండు రోజులుగా కరెంటు లేదు

నా కోడలు ప్రసవం కోసం వచ్చాం. కాన్పు అయ్యి రెండురోజులు అయ్యింది. రెండు రోజులనుంచి ఆసుపత్రిలో కరెంటు లేదు. రాత్రి ఫ్యాన్‌లు లేక ఉక్కపోతతో బయటకు వచ్చి పడుకున్నాం. బాత్రూంలో నీళ్లు లేవు. తాగటానికి నీళ్లు లేవు. బయటకు వెళ్లి నీళ్లు కొని తెచ్చుకున్నాం.

- ఉసేన్ బీ, సూగూరు

వర్షం కారణంగా షాట్‌సర్క్యూట్ ఏర్పడి సరఫరా నిలిచిపోయంది

కురిసిన వర్షానికి ఆసుపత్రిలో విద్యుత్ తీగల్లో షాట్‌సర్క్యూట్ ఏర్పడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆస్పత్రిలో విద్యుత్ వినియోగం అదికంగా ఉంది. విద్యుత్ సరఫరా పునరుద్దరణకు వెంటనే చర్యలు తీసుకున్నాం. స్థానిక ఆసుపత్రి ఎలక్ట్రీషన్‌తో ప్రయత్నించాం. అయితే ఫలితం లేకపోవటంతో ఏపీహెచ్ఎంఐడీసీ ఇంజనీర్‌ను రప్పించి విద్యుత్ సరఫరానిలిచిపోవటానికి కారణాలను గుర్తించాము. త్రీ ఫేస్ ఉన్నచోట ఒక ఫేస్ మీద సరఫరా చేశాం. కేబుల్స్ మార్చాల్సి ఉంది. వాటిని కూడా మార్చుతాము. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నాం. - డాక్టర్ మైత్రేయి, ఆసుపత్రి సూపరింటెండెంట్

మంత్రాలయం లాడ్జీల్లో ముమ్మర తనిఖీలు

● అదుపులో పలు జంటలు
● కౌన్సెలింగ్ ఇచ్చి పంపించిన పోలీసులు



మంత్రాలయం లాడ్జీలపై తనిఖీలు చేస్తున్న పోలీసులు

మంత్రాలయం, మే 18: మంత్రాలయం పుణ్యక్షేత్రంలో ప్రైవేటు లాడ్జీలపై పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేశారు. శుక్రవారం రాత్రి, శనివారం మధ్యాహ్నం మంత్రాలయం సీఐ ఎరిషావలి ఆధ్వర్యంలో మంత్రాలయం, మాధవరం ఎస్ఐలు గోపినాథ్, కృష్ణమూర్తి, ఏఎస్ఐ ఆనందరెడ్డి అకస్మికంగా తనిఖీలు చేశారు. ఎన్నికల నేపథ్యంలో కర్నాటక, అటు ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన నాయకులు అనుమానితులు మంత్రాలయంలో ఉంటున్నారన్న అనుమానాలు, వివిధ కారణాలతో తనిఖీలు చేశారు. అనుమానితులుగా ఉన్న జంటలను అదుపులోకి తీసుకుని విచారించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేశారు. లాడ్జీల్లో చాలామంది అద్దెకు తీసుకుని అధిక రేట్లకు గదులను కేటాయించడం, అసాంఘీక కార్యకలాపాలు, పేకాట, మద్యం వంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లాడ్జీ యజమానులు పక్కా ఆదారాలతో గదులను అద్దెకు ఇవ్వాలని, సీసీ కెమెరాలు ప్రతి లాడ్జీలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ తనిఖీలో కోదండరామిరెడ్డి, దశరథరాముడు, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

సెమిస్టర్ పరీక్షల్లో సిలబస్‌లో లేని ప్రశ్నలు

● యూనివర్సిటీ తప్పిదాలతో విద్యార్థుల అవస్థలు


ఆదోని (అగ్రికల్చర్), మే 18: రాయలసీమ యూనివర్సిటీ రెండవ సెమిస్టర్ పరీక్షలు మొదలైన విషయం విదితమే. అయితే, డిగ్రీ మొదటి సంవత్సరానికి సంబంధించి శనివారం హిందీ పరీక్ష యధావిధిగా ప్రారంభించారు. విద్యార్థులకు 20సీ 2104 కోడ్ ప్రశ్నాపత్రం అందజేశారు. అందులో సిలబస్ నుంచి తొలగించిన పాఠాలు నుంచి ప్రశ్న పత్రం ఇచ్చారని విద్యార్థులు మూకుమ్మడిగా కేంద్రాలలో ఇన్విజిలేటర్‌లను ప్రశ్నించారు. తేరుకున్న సిబ్బంది హుటాహుటిన యూనివర్సిటీకి సమాచారం చేర్చారు. యూనివర్సిటీ అధికారులు తక్షణమే 23సీ 2104 కోడ్ గల ప్రశ్నాపత్రాన్ని ఆయా కేంద్రాలకు మెయిల్ ద్వారా పంపారు. మెయిల్ ద్వారా వచ్చిన ప్రశ్నాపత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకొని, జిరాక్స్ చేయించి విద్యార్థులకు అందించారు. ఈ తతంగం అంతా సుమారు అరగంట పాటు హైడ్రామాగా నడిచింది. విద్యార్థులకు ఏమి బోధిస్తున్నారో అనేది కూడా తెలియకుండా యూనివర్సిటీలో ప్రొఫెసర్లు ప్రశ్నాపత్రాలను తయారు చేస్తున్నారా..? అంటూ విషయం తెలుసుకున్న తల్లితండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండవ సారి వచ్చిన ప్రశ్నాపత్రంలో కూడా మరో తప్పు చేస్తూ, పుస్తకంలో లేని మూడు ప్రశ్నలు ఇవ్వగా.. వాటిని కొట్టివేసి చేత్తో రాసి ఇవ్వడం గమనర్హం. ఆదోని పట్టణంలో మూడు కేంద్రాలైనా ఆర్ట్స్ కళాశాలలో 75, జ్యోతిర్మయి కలాశాలలో 48, సాయి కళాశాలలో 65 మంది విద్యార్థులు హిందీ పరీక్షకు హాజరయ్యారు. ప్రశ్నాపత్రం ఆలస్యంగా ఇచ్చినప్పటికీ అదనపు సమయం తక్కువ ఇవ్వడం వలన జవాబులు రాయలేకపోయామని పేరు చెప్పని విద్యార్థులు వాపోయారు.

మాధవరంలో వైభవంగా గంగాభవాని పల్లకోత్సవం

మంత్రాలయం, మే 18: మంత్రాలయం మండలంలోని మాధవరం గ్రామంలో వెలసిన గంగాభవాని పల్లకత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం ఆలయంలో గంగమ్మ అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, హారతులు, అర్చనలు చేసి అమ్మవారిని చూడముచ్చటగా అలంకరించారు. తుంగభద్ర నది జలాలతో అభిషేకించి పల్లకీలో ఊరేగించారు. అమ్మవారి పల్లకోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. గ్రామ మహిళలు మహామంగళహారతులు ఇస్తూ.. బీరప్పడోళ్లు, మంగళవాయిద్యాలు, భక్తుల హర్షాధ్వానాల మధ్య టపాకాయ పేల్చుతూ పురవీధుల గుండా ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఊపందుకున్న బెట్టింగులు

● గ్రామాల్లో మెజారిటీలపై వేలల్లో పందేలు



మంత్రాలయం, మే 18: నియోజకవర్గంలో ప్రధాన రాజకీయ పార్టీల సానుభూతి పరుల బెట్టింగులు ఊపందుకున్నాయి. జిల్లాలో అత్యధికంగా మంత్రాలయంలో 84.31 శాతం పోలింగ్ నమోదు కావడంతో అందరి దృష్టి మంత్రాలయపైనే పడింది. ఒక బీసీ, ఆధిపత్య కులాల మధ్య జరిగిన 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ నెలకొనడంతో బెట్టింగ్‌రాయుళ్లు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తూ రూ.లక్షల్లో బెట్టింగ్‌కు సిద్ధమవుతున్నారు. పెరిగిన ఓటింగ్ శాతం ఎవరి కొంప ముంచుతుందో తెలియకుండానే బెట్టింగ్ రాయుళ్లు పెరిగిన ఓట్లు తమ పార్టీకే ఉంటాయని అంచనావేస్తున్నారు. కోసిగి మండలంలో ఈ ఎన్నికల్లో నిశ్శబ్ద వాతావరణంలో 83.39 ఓటింగ్ శాతం నమోదు కాగా.. కౌతాళంలో 84.44 ఓటింగ్ శాతం నమోదైంది. మంత్రాలయంలో 84.02, అత్యధికంగా పెద్దకడుబూరు మండలంలో 85.59 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల మధ్య వరకు జరిగిన పోలింగ్ ప్రక్రియ ఎవరికి అనుకూలంగా ఉంటుందన్న అంచనాలతో ఇరుపార్టీల నేతలు తమకంటే.. తమకంటూ తమ నాయకుల వద్ద సర్వేలు, సమీక్షలు నిర్వహించుకుంటున్నారు. గ్రామాల్లో మెజారిటీలపై మండల స్థాయి నుంచి గ్రామ స్థాయి నాయకులు వేలల్లో పందేలకు దిగుతున్నారు. కొంత మంది 10 గ్రాముల బంగారు, వెండి వంటి ఆభరణాలు పందేలు కాస్తుండగా.. మరోవైపు నగదుతో బెట్టింగ్‌కు వెనుకాడడం లేదు. జూన్ 4న కౌంటింగ్ ఉండగా.. ముందుగానే ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బెట్టింగులకు తెరలేపారు. మంత్రాలయం నియోజకవర్గంతో పాటు పక్కనే ఉన్న కర్ణాటక వాసులు సైతం బెట్టింగులో ముందుకు వస్తున్నారు. మూడుసార్లు హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా ఉన్న బాలనాగిరెడ్డి, మొదటి సారిగా బీసీ సామాజికవర్గం వాల్మీకి నేత కీర్తిశేషులు రామిరెడ్డి కుమారుడు రాఘవేంద్రరెడ్డి మధ్య నువ్వా.. నేనా అన్న రీతిలో ఓటింగ్ ప్రక్రియ జరిగింది. ఈ సరళిని బట్టి తగ్గేదేలే అంటూ బెట్టింగులు కాస్తున్నారు. బెట్టింగులో ఎవరి అదృష్టం ఎలా ఉంటుందో జూన్ 4న తేలనుంది.

గ్రామ నాయకులతో బీవీ సమీక్ష



బీవీని పూలమాలతో సన్మానిస్తున్న దృశ్యం

గోనెగండ్ల, మే 18: ఏపీలో ఎన్డీఏ ప్రభజనం వీచింది, జూన్ 4న ఎన్డీఏ కూటమి విజయం సాధించడం ఖాయం అని మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని గోనెగండ్ల, పెద్దమరివీడు, అలువాల గ్రామాల్లో బీవీ పర్యటించారు. టీడీపీ గెలుపు కోసం కృషి చేసిన వారి అందరికీ అభినందనలు తెలిపారు. ఆయాగ్రామాలలోని టీడీపీ నాయకులతో సమావేశం అయ్యారు. పోలింగ్ సరళిపై సమీక్షించారు. ఏ గ్రామంలో ఎంత మెజార్టీ వస్తుంది అని అడిగి తెలుసుకున్నారు. గ్రామ సమస్యలను తీర్చేందుకు టీడీపీ ముందుంటుందని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. టీడీపీ గెలుపుకోసం కార్యకర్తలు ఎంతో కృషి చేశారని అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో వైసీపీకి ఓటమి తప్పదని ఎమ్మిగనూరులో టీడీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. పార్టీ కోసం పాటు పడిన వారికి పార్టీ మంచి గుర్తుంపు ఇస్తుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయానికి పంచలోహ ముఖద్వారం విరాళం

మద్దికెర, మే 18 : గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో పద్మావతి వెంకటేశ్వరస్వామి గర్భగుడి ముఖద్వారానికి పంచలోహ కవచాన్ని దాతలు విరాళంగా అందజేవారు. గ్రామానికి చెందిన కీర్తిశేషులు ముత్యాల చలపతిశెట్టి జ్ఞాపకార్థం ఆయన భార్య ముత్యాల పద్మావతమ్మ, కుమారులు ముత్యాల రాజశేఖర్ శెట్టి, లక్ష్మీ దంపతులు రూ.2లక్షలు విలువ చేసే ముఖద్వారాన్ని ఆలయ ధర్మకర్తలకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ముత్యాల కాశీవిశ్వనాథ్, సుదర్శన్ శెట్టి, మెడికల్ కాశీ, సుంకు రవీంద్ర ఉన్నారు.

నీటి సమస్య రాకుండా చూస్తాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మద్దికెర, మే 18: మండలంలోని పెరవలి గ్రామంలోని బీసీ కాలనీలో నీటి సమస్య లేకుండా చూస్తామని ఈవోఆర్డీ మద్దిలేటి స్వామి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ అన్నారు. శనివారం ఆంధ్రజ్యోతిలో 'కన్నీటి వ్యథ' పెరవలిలో నీటి సమస్య అన్న శీర్షికన ప్రచురితమైన వార్తకు స్పందించిన పంచాయతీ అధికారులు బీసీ కాలనీలో ఐదు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ కాలనీలో నీటి సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు. ప్రతి రోజు ఐదు ట్యాంకర్లతో నీటిని వదులుతామని, ప్రజలు నీటిని వృథా చేయకుండా వాడుకోవాలని సూచించారు.

సబ్సిడి వేరుశెనగ కోసం దరఖాస్తు చేసుకొండి

దేవనకొండ ,మే 18 : ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం రైతులను సబ్సిడిపై అందించే వేరుశెనగ విత్తనాల కోసం 20వ తేది నుండి ఆర్బీకెలలో రైతులు దరఖాస్తు చేసుకొవాలని వ్యవసాయ అధికారి సురేష్‌బాబు తెలిపారు. క్వింటం వేరుశెనగ రూ.9500 ధర నిర్ణయించిన్నట్లు 40శాతం సబ్సిడి పోను క్వింటానికి రూ.5700 చెల్లించాలన్నారు.మండలంలోని 22 ఆర్బికెలకు 2800 క్వింటాలు మంజూరైన్నట్లు ఎఓ తెలిపారు.

మంత్రాలయంలో కిక్కిర్సిన భక్తులు

మంత్రాలయం, మే 18 : రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం సందడి గా మారింది. శని, ఆదివారం సెలవు దినాలు కావటంతో దక్షణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగాణం భక్తులతో కిక్కిరిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నది తీరం భక్తులతో కోలాహాలంగా మారింది. తుంగభద్ర నదిలో పుణ్య స్నానాలు ఆచరించి గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవాల ఊరేగింపులో పాల్గొని మఠం పీఠాధిపతుల ఆశీస్సులు పొందారు. సొంత వాహనాల్లో వచ్చిన భక్తులు ప్రధాన రహదారిపై కార్లను పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో భక్తులు, గ్రామ ప్రజలు ఇబ్బందులు బడ్డారు. ప్రైవేట్ లాడ్జీ ధరలకు రెక్కలొచ్చాయి. పూజా సామాగ్రికి డిమాండ్ పెరిగింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొన్న మఠం అధికారులు క్యూలైన్లు,పరిమళ ప్రసాదం వద్ద ఏర్పాట్లు చేశారు.

రాఘవేంద్రస్వామి మఠంకు రూ.లక్ష విరాళం : రాఘవేంద్రస్వామి మఠానికి బెంగుళూరుకు చెందిన అజ్ఞాత భక్తుడు రూ.లక్ష శాశ్వత సేవకు విరాళం ఇచ్చినట్లు మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి తెలిపారు. శనివారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని రూ.లక్ష విరాళం ఇచ్చినట్లు తెలిపారు

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

గోనెగండ్ల, మే 18: వీరంపల్లి గ్రామంలో శనివారం వీరబ్రహ్మేంద్రస్వామి 28వ తిరునాల ఉత్సవాలు భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం గ్రామోత్సవం, అనంతరం స్వామివారి దంపతుల కళ్యాణం, సాయంత్రం రథోత్సవం భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ ఉత్సవాలకు మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హజరయ్యారు. ఆదివారం తిరుణాల సందర్భంగా పరుగుపందెం, బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు. బండలాగుడు పోటీలలో గెలుపొందిన ఎద్దుల యజమానులకు ప్రథమ బహుమతిగా రూ. 20,016, ద్వితియ బహుమతిగా రూ. 15,016, తృతియ బహుమతిగా రూ. 10,016 నగదును బహుకరిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త సంజీవయ్యస్వామి తెలిపారు.